**నమ్మలేని నిజాలు**

దూరప్రయాణం
వాహనం లేనికాలం
కన్నులె కాళ్ళు.

అణు క్షిపణి
పాతవన్నీ పోయాయి
విషవాయువు.

భరోసా సూత్రం
తుపాను లో పడవ
ఆశల తీరం

రంపపు కోత
చక్కెరవ్యాధి వుండు
శ్మశాన దారి.

ఆస్తిక జయం
అతీంద్రియ శక్తులు
ఉదారవాదం



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

**శ్రీనిజాలు**

ఉమ్మడి రాజధానిగా
ఉండాలోయ్ హైద్రాబాద్ !
ఏపీ రాజధానిగా
కట్టెదాక జిందాబాద్ !.

ఉప్పేసీ పొత్తు కూడు
ఏదైన పెద్దె తింటరు !
ఇసంత రమ్మంటే ఈ
ఇల్లు నాదనే అంటరు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 15-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:154 పేజీలు:6 వెల: రూ.1/-

## తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ సీట్లు ఖరారు..

హైదరాబాద్, ఫిబ్రవరి 14:తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ సీట్లు ఖరారు అయ్యాయి. రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సీట్లు ఖరారు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. మధ్యప్రదేశ్ నుంచి అశోక్ సింగ్, కర్ణాటక నుంచి అజయ్ మాకెన్, డాక్టర్ సయిద్ నసీర్ హుస్సేన్, జీసీ చంద్రశేఖర్‌కు అవకాశం కల్పించారు.

## రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్

**-మీడియా పాయింట్ వద్దకు మాట్లాడేందుకు వెళ్తుండగా మార్షల్స్ అభ్యంతరం**
**-మీడియా పాయింట్‌కు వెళ్ళే మార్గంలో కింద కూర్చుని ఎమ్మెల్యేలు నిరసన**



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాడీవేడి వాదనలు జరిగాయి. బీఆర్ఎస్ తరఫున చర్చను ప్రారంభిం చిన కడియం శ్రీహరి.. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు.. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పాలకులు అనుసరిస్తున్న విధానాలకు సంబంధం లేదని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న రాద్ధాంతంపై కూడా ఆయన విమర్శలు చేశారు.కడియం మాట్లాడ తుండగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అడుగడుగునా అడ్డుతగిల రు. ఓ సందర్భంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడు తూ.. కడియం గతంలో రాజయ్య నుంచి ఉపముఖ్యమంత్రి పదవిని లాక్కున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కూడా విమర్శలు చేశారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజగోపా ల్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి లేచి అగ్నికి ఆజ్యం పోశారు. నల్లగొండ సభలో కేసీఆర్ తన గురించి అవమానకరంగా మాట్లాడారని, అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు పాయింట్ పీకేసినా బుద్ధి మారలేదని వ్యాఖ్యానించారు. దాంతో బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా రు. రాజగోపాల్‌రెడ్డి, సీఎం రేవంత రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా శాసనసభ నుంచి వాకౌట్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. సభ నుంచి బయటకు వచ్చిన ఎమ్మె ల్యేలు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు మాట్లాడేందుకు వెళ్తుండగా మార్షల్స్ అభ్యంతరం తెలిపారు. అసెంబ్లీ నడుస్తున్నప్పుడు మీడియా పాయింట్‌లో ప్రెస్‌మీట్స్‌కు అవకాశం లేదని అసెంబ్లీ భద్రతా సిబ్బంది తెలి పారు. కొత్త నిబంధనలు ఏంటంటూ సిబ్బందితో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు వాగ్వాదానికి దిగారు. అయితే గతంలో నుంచే ఈ నిబంధ నలు ఉన్నాయని అసెంబ్లీ సిబ్బంది తెలిపారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరే కంగా గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు నినా దాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని నిరసనకు దిగారు. మీడియా పాయింట్‌కు వెళ్ళే మార్గంలో కింద కూర్చుని ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ లోపల మాట్లాడటానికి అవకాశం ఇవ్వరని... అసెంబ్లీ బయట కూడా మీడియాతో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వరా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినదిస్తున్నారు.

## సరస్వతి అలంకరణలో శ్రీ కనకదుర్గమ్మ..



అమరావతి, ఫిబ్రవరి 14: జ్ఞానానికి అధిదేవత సరస్వతి. ఆమె జ్ఞానస్వరూపిణి. శాస్త్రం, కళలు, విజ్ఞానం, హస్తకళలు మొదలైన వాటిని చదువుల తల్లి సరస్వతి అంశాలుగా పురాణాల్లో పేర్కొన్నారు. సృజనాత్మక శక్తికీ, స్ఫూర్తికీ కూడా వీణాపాణి అయిన సరస్వతిని సంకేతంగా చెప్పడం మన సంప్రదాయం.

శుద్ధ సత్వ గుణ శోభిత, శ్వేత వస్త్రాలతో అలంకృతయై, హంస వాహినిగా తామర పుష్పం మీద సరస్వతి దేవిగా అమ్మవారు కొలువు దీరి ఉంటారు. ఆమె అక్షరవ వాల, గ్రంథం ధరించడంతో పాటు వీణా వాదనం చేస్తుంటు, వేదాలు సైతం సరస్వతి దేవి నుండే ఆవిర్భవించయని వేదాలు చెబుతున్నా యి. చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టినరోజు అయిన వసంత పంచమి బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలోని కనకదుర్గమ్మ వారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు.వసంత పంచమి రోజున తెల్లవారుజామునుండే అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున విద్యార్థినీ విద్యార్థులు తరలివచ్చారు. ఆలయం లోని మహా మండపం ఆరవ అంతస్తులు సరస్వతి దేవి అలంకరణ లో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలను ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యుడు శంకర్ శాండిల్య నేతృత్వంలో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పరీక్షల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుతూ అమ్మవారి చెంత పెన్నులు, కుంకుమ, రక్ష, ఫోటోలను ఉంచి ప్రత్యేక పూజలు అనంతరం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. తెల్లవారుజామున 5 గంటల నుండి పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి ఒక్క విద్యార్థికి పెన్నులను బహుకరించే విధంగా 50 వేలకు పైగా పెన్నులను అధికారులు సిద్ధం చేశారు.

## రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కీలక అభ్యర్థుల పేర్లను బీజేపీ అధిష్ఠానం ఖరారు

**-గుజరాత్ నుంచి నడ్డా, మహారాష్ట్ర నుంచి అశోక్ చవాన్**

న్యూఢిల్లీ ఫిబ్రవరి '4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కీలక అభ్యర్థుల పేర్లను బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభకు పోటీ చేయనుండగా, ఇటీవలే కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన అశోక్ చవాన్‌ను మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు ఎంపిక చేసింది. జేపీ నడ్డాతో పాటు గుజరాత్ నుంచి రాజ్యసభకు గోవింద్ భాయ్ ధోలకియా, మయాంక్ భాయ్ నాయక్, జస్వంత్ సిన్హ్ సలామ్‌సిన్హ్ పార్మర్ పేర్లను అధిష్ఠానం ఖరారు చేసింది. మహారాష్ట్రలో అశోక్ చవాన్‌తో పాటు మేధా కులకర్ణి, అజిత్ గోప్ఛడేలను బీజేపీ నామినేట్ చేసింది.బీజేపీ తరఫున ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలో దిగిన ఏడుగురు అభ్యర్థులు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో బుధవారంనాడు నామినేషన్ వేశారు. వీరిలో మాజీ కేంద్ర మంత్రి ఆర్‌పీఎన్ సింగ్, మాజీ ఎంపీ చౌదరి తేజ్‌వీర్ సింగ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదగర్శి ఆమ్రపాల్ మౌర్య, రాష్ట్ర మాజీ మంత్రి సంగీత బల్వంత్, పార్టీ ప్రతినిధి సుధాన్షు త్రివేది, మాజీ ఎమ్మెల్యే సాధనా సింగ్, ఆగ్రా మాజీ మేయర్ నవీన్ జైన్ ఉన్నారు. నామినేషన్ సందర్భంగా సీఎంతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర సింగ్ చౌదరి, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేష్ పాఠక్, బీజేపీ యూపీ లోక్‌సభ ఇన్‌ఛార్జి బైజయంత్ పాండే హాజరయ్యారు

## ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వండి.. ధర్మపురి అరవింద్



నిజామాబాద్, ఫిబ్రవరి 14:నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడుగా మరోసారి అవకాశం కల్పించాలని, 5సంవత్సరాలు అవినీతి లేకుండా పరిపాలన చేసానని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఆయన బుధవారం వసంత పంచమి సందర్భంగా పార్లమెంట్ స్థాయి బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఆర్మూర్ పట్టణంలో ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. మోడీ చరిస్మాతో మరోసారి కేంద్రంలో అధికారంలోకి రాబోతున్నామన్నారు. 2019 ఎన్నికల్లో చెప్పినట్లు పసుపు రైతులకు పసుపు బోర్డు తెచ్చామని దాంతో పసుపుకు మద్దతు ధర పెరిగిందన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఆర్వోబి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు.

జిల్లా కేంద్రంలోని మాదవ్ నగర్ రైల్వే బ్రిడ్జి కోసం 35 సంవత్సరాలుగా ప్రజలు పోరాడారని, అది గమనించి నా హయాంలో రైల్వే మంత్రితో మాట్లాడి రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభించామని, ఈ సంవత్సరంలో ప్రారంభించుకోబోతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మరోసారి ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ఏలేటీ మహేశ్వరరెడ్డి

హైదరాబాద్ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ఏలేటీ మహేశ్వరరెడ్డిని ఆ పార్టీ హై కమాండ్ బుధవారం నాడు అధికారికంగా ప్రకటించింది. ఫ్లోర్ లీడర్‌తో పాటు మిగతా సభ్యులను కూడా అధిష్ఠానం నియమించింది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పాయల్ శంకర్, చీఫ్ విప్‌గా పాల్వాయి హరీష్ బాబు, విప్‌గా ధన్ పాల్ సూర్యనారాయణ, ట్రెజరర్‌గా పైడి రాకేష్ రెడ్డి, ఆఫీస్ సెక్రటరీగా రామారావు పాటిల్‌ను బీజేపీ హైకమాండ్ నియమించింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ 8 సీట్లను గెలుచుకున్న విషయం తెలిసిందే.కాగా.. ఏలేటి మహేశ్వర రెడ్డి నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో ఆయన ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యేగా పనిచేశారు. అయితే అసెంబ్లీ బీఏసీ సమావేశానికి 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల్లో ఒకరిని పిలవాలని ఆ పార్టీ శాసనసభ్యులు స్పీకర్‌ను కోరారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డిని పిలవాలని బీజేపీ ఎమ్మెల్యేలంతా సంతకాలు చేసిన లేఖను స్పీకర్‌కు అందించిన విషయం తెలిసిందే. దీంతో బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వరరెడ్డి బీఏసీ సమావేశానికి హాజరయ్యారు. దీనిని బట్టి బీజేపీ శాసనసభా పక్షనేతగా ఏలేటి మహేశ్వరరెడ్డి పేరును బీజేపీ హైకమాండ్ ఖరారు చేసింది.

## తెలుగు భాషా పరిరక్షణకు చిట్టెన్‌రాజు విశేష కృషి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు.

తెలుగుభాషా పరిరక్షణకు చిట్టెన్ రాజు విశేషకృషి చేస్తున్నారని వేంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది దేశాల లో ప్రపంచ తెలుగు మహాసభలు స్వయంగా నిర్వహించడం ప్రభుత్వాలు కూడా చేయలేని పని అని, అమెరికాలో ఉండి భాషా సంస్కృతి పట్ల.. అభిమానం చాటుకుంటున్నారన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి త్యాగరాయ గాన సభలో నాలుగు గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ రచయిత లేకుంటే ఏ కళాప్రక్రియ లేదన్నారు. నటుడు తనికెళ్ల భరణి, శ్రీదేవి మురళీధర్ రచించిన స్వయంసిద్ధ నవలను ఆవిష్కరించి మాట్లాడారు. నటి రేఖ జీవిత చరిత్ర స్వయం సిద్ధ అని, అది అత్యుత్తమ జీవిత చరిత్ర అన్నారు. వంగూరి చిట్టెన్‌రాజు రచించిన అమెరికా కాకరకాయ కథలు సినీ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, డయాస్పొరా తెలుగు కథల సంకలనంను సాహితీవేత్త డా॥ ఓలేటి పార్వతీశం, అర్ధ శతాబ్దిలో అమెరికా తెలుగు కథలు సంపుటిని అవధాని కడిమెళ్ల వరప్రసాద్ ఆవిష్కరించారు. రాధిక మంగిపూడి, వంశీరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య విమర్శనా వ్యాసాలు 'తదేక' ఆవిష్కరణ



సభలోపాల్గొన్న అతిథులు.

డాక్టర్ మహమ్మద్ హసేన్ రచించిన సాహిత్య విమర్శనా వ్యాసాలు 'తదేక' ను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర్లు మంగళవారం బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సభలో ఓయూ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు సూర్యాధనంజయ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కవి కె. ఆనందాచారి, డా॥పి. సురేందర్ రెడ్డి, డా॥ వెల్దండ శ్రీధర్, డా॥పి. మధుసూదన్‌రెడ్డి, డా॥ ఎస్. రాజారామ్, కవి యాకూబ్, టి. భాస్కర్ రెడ్డి, అనంతోజు మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యంలో మేరు శిఖరం 'రవ్వా శ్రీహరి'



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య పిల్లల రాములు

వెనుకబడిన కులాలు వృద్ధిలోకి రావాలంటే చదువులో ముందుండాలని రవ్వా శ్రీహరి నేర్పిన పాఠం విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోరాదని పలువురు వక్తలు అన్నారు. సంస్కృత వ్యాకరణానిరికి భాష్యం చెప్పిన తెలుగు సాహిత్య మార్గదర్శకుడు రవ్వా శ్రీహరి అని కొనియాడారు. మంగళవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రాంగణంలో 'రవ్వా శ్రీహరి రచనలు-విహంగ వీక్షణం'పై సదస్సు జరిగింది. ఈ సభలో చెన్నప్ప మాట్లాడుతూ రవ్వా శ్రీహరికి వ్యాకరణం ప్రాణమని, శబ్దం మీద పట్టు ఉన్నవాడని కొనియాడారు. ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని విశ్లేషించిన రవ్వా శ్రీహరి చెప్పే పాఠాలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ భాషా సాహిత్యాలు ఉన్నంతవరకు రవ్వా శ్రీహరి పేరు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా ఉంటుందన్నారు. సదస్సులో తెలుగు అకాడమీ మాజీ సంచాలకులు ప్రొఫెసర్ కె. యాదగిరి, డాక్టర్ ఎస్. రఘు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్. వాసు, పరిశోధక విద్యార్థి యాదగిరి పాల్గొన్నారు.

## ఆలూరి విల్సన్ 'హరివిల్లు' ఆవిష్కరణ



హరివిల్లు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్.

గద్దర్ ప్రాంగణంలోని రవ్వా శ్రీహరి వేదికపై భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆలూరి విల్సన్ కవితా సంపుటి 'హరివిల్లు'ను ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలూరి విల్సన్ నిరంతరం సమకాలీన పరిస్థితులపై కవిత్వం రాస్తూ తనదైన శైలిలో సాహిత్య సేవ చేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత మాణిక్యరెడ్డి, చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.




**చురక**

రైతు చలో డిల్లీ నేడు
రణరంగపు దృశ్య చరిత
రాజ్యమిపుడు బుల్లెట్ తో
రాస్తుందిక వారి భవిత
సమస్యలు చెప్పుకునే
చలిచీమలు వాళ్లు నేడు
సర్కారుకు తప్పదింకా
సర్పమైతే చావు చూడు



-వేల్పుల నారాయణ
9440433475

## మానవశాస్త్రానికి డిజిటల్ రంగులు అద్దాలి !

ప్రతి ఏట ఫిబ్రవరి 3వ గురువారం, అనగా 15 ఫిబ్రవరి 2024న ప్రపంచ దేశాలు "ప్రపంచ మానవ శాస్త్ర దినోత్సవం (వరల్డ్ ఆంత్రపాలజీ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. మానవశాస్త్రంలో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాలను, ప్రాధాన్యాలను, లోతైన అధ్యయనాలను చేయడానికి ఆసక్తి కలిగిన మానవాళికి వివరించడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. మానవత్వ (హుమానిటీ) శాస్త్రీయ అధ్యయనాలను, మానవ జాతి/సమాజ ఎదుగుదల, కల్చర్, మానవ జీవశాస్త్ర పోకడలు, మానవ ప్రవర్తనలో వస్తున్న మార్పులు, నమ్మకాలు, భాషా పరిణామాలు, సామాజిక నిర్మాణాలు, ప్రపంచ మానవ జాతుల వైవిధ్యత అధ్యయనాలు, ఆచార వ్యవహారాలలో వస్తున్న మార్పులను వివరించే విభాగంగా మానవశాస్త్రంగా అర్థం చేసుకోవాలి. సామాజిక సాంస్కృతిక, జీవసంబంధ, పురావస్తు విభాగాలుగా మానవశాస్త్రాన్ని విభజించి అధ్యయనం చేస్తారు.

**మానవశాస్త్ర దినోత్సవ ఆవిర్భావం:**

''అమెరికన్ ఆంథ్రపాలజీ అసోసియేషన్'' చొరవతో 2015 నుంచి ప్రపంచ మానవశాస్త్ర దినోత్సవం పాటిస్తున్నాం. రాజకీయం, ఆర్థికం, ఆహారం, జాతులు, పిల్లల పెంపకం లాంటి పలు సంబంధిత అంశాలు మానవ జీవితాలపై చూపుతున్న ప్రభావాలను మానవశాస్త్రం వివరిస్తున్నది. మానవశాస్త్ర పరిశోధన ఫలాలను సామాన్యులకు వివరించడానికి, అవగాహన పెంచుకోవడానికి, ఆధునిక పరిశోధనలను ప్రోత్సహించడానికి, విద్యార్థుల్లో మానవశాస్త్రం పట్ల ఆసక్తిని పెంచడానికి, మానవ శాస్త్రాన్ని కెరీర్‌గా తీసుకోవడానికి ఊతం ఇవ్వడానికి ప్రపంచ మానవ శాస్త్ర దినోత్సవ వేదికలు పని చేస్తున్నాయి. వైద్య, ప్రజారోగ్య, వ్యాపారం, పర్యావరణ పరిరక్షణ, మార్కెటింగ్, మానవ వనరులు, ఫోరెన్సిక్స్, మ్యూజియం రంగాల్లో మానవశాస్త్ర పట్టాలు పొందిన యువతకు ఉద్యోగ ఉపాధులు జనిస్తాయి.

**మానవశాస్త్ర అధ్యయన అంశాలు:**

వాతావరణ మార్పులు, మానవ వలసలు, విపత్తుల వంటి సవాళ్లకు సరైన సమాధానంగా మానవశాస్త్ర అధ్యయనాలు దోహదపడుతున్నాయి. వివిధ మానవ జాతుల మధ్య అంతరాలను చెరుపుతూ సమన్వయ పరచడం, శాంతియుత సహజీవనాలకు ఊతం ఇవ్వడం, మానవ విలువలు/నమ్మకాల విశ్లేషణలు, భాషలు అంతరించకుండా చొరవ తీసుకోవడం, సాంస్కృతిక వారసత్వ సంపదల పరిరక్షణ లాంటి లక్ష్యాలు కూడా మానవశాస్త్ర పరిధిలోకి వస్తాయి. మానవశాస్త్రానికి డిజిటల్ రంగులు అద్దుతూ మానవత్వ పరిమళాలను, ప్రపంచ శాంతి సుగంధాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేయడానికి నేటి యువత కృషి చేయాలని కోరుకుందాం.

(15 ఫిబ్రవరి "ప్రపంచ మానవ శాస్త్ర దినోత్సవం" సందర్భంగా)

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

నేటి కందం- నేటికి అందం

కూరిమినిడ-నూతనమగు
దారులు కనుగొనగ గొప్ప దార్శనికతతోన్
తీరుగ కృషి సంస్థ వెలసె
భారత వ్యవసాయ దివ్య పరిశోధనకై

( 1976 ICAR స్థాపన )



-రాధశ్రీ
సెల్:9494481210






కరువుకి
నేలమ్మ గుండె పగిలింది
పగుళ్ళనిండా
రాలిన ఆశలు..



-డా॥ సి. భవానీదేవి
9866847000

నేటినిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com



సంగీత సాహిత్య సమ్మేళనం
సామవేద శోధనం
ఆదిమధ్యాంతరహితుని
అనుగ్రహ సాధనం.

ఎవరి స్థితి
ఎప్పుడెలా మారుతుందో?
ఎవరి ఉనికి
ఎలా మరుగవుతుందో?

చేయన నేరాలకు సహితం
శిక్షలుంటాయి
జీవితంలో ఊహలకందని
విచిత్రాలుంటాయి.

ఘంటారావం

తెలుగదేలయన్న
తెలుగే వెలుగు
తీరాలు దాటిన
తెరచాప తెలుగు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## తెలుగు పాటలకు మాస్టార్ ఘంటసాల



సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

అమర గాయకుడు ఘంటసాల మన మధ్య లేకపోయినా ఆయన పాటలు ప్రతినిత్యం వింటూనే ఉన్నామని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల లేని 50 ఏళ్లు- ఆ పాగ మధురాలు అభ్యుదయ గీతాలు కార్యక్రమం టీపీఎస్‌కే ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్‌తేజ మాట్లాడుతూ తరాలెన్ని మారినా తెలుగు పాటకు మాస్టార్ ఘంటసాలేనని అన్నారు. భూమి ఆకాశం మనుషులున్నంత కాలం ఘంటసాల పాట ఉంటుందని అన్నారు.

ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి, రమ, శాస్త్రి, నర్సింగ్‌రావు, వేణుమాధవ్, ప్రణీత, అక్షరదీప్తి, అల్తా, అన్నపూర్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఆలోచనా విధానం మారితే...

భావ సంస్కారానికి
భాషే తోడు యాసే నీడ
కాదంటే
సమస్య అమావాస్య బి
అరకొర అలవోక సాధనతో
తల్లివొడిభాష
బొడ్డుపేగుభాష స్వంతం
చుక్కల్లాంటి అక్షరాల్ని చెక్కుకుంటూ
సునిశితంగా సున్నితంగా
పటనీయం చర్చనీయం
ఏకకంఠంతోనో ముక్తకంఠంతోనో
ప్రశ్నించడానికి నిలదీయడానికి
సిద్ధం
మూలభాష ఎరిగినవాడు
మాతృభాష తెలిసినవాడు
ఎప్పుడూ విజేత
నీ మట్టిలో నీవు
స్వతంత్రత పురుడు బోసుకొని
సహజమేధస్సుతో
గౌరవసూచకం గౌరవవాచకం
విదేశీభాషా పునాదుల మీద
భవనాలు కవనాలు ఎందుకు?
తిరస్కారం ఏహ్యత చిన్నచూపుతో లేను
అపారబలం సముచితస్థానం
అన్యభాషతో అంటే ఒప్పుకోను
ఒక స్థాయిని ఒక హోదాని
ఇచ్చేది మాతృభాషే
ఏడారిలో పులకింతలా
చీకటిలో పాలపుంతలా
తేనెలొలికే తేటభాష
పరిరక్షణే అందరి ఘోష



- కోటం చంద్రశేఖర్
9492043348

## సునందామృతం

### చందన గుణ న్యాయము

చందనము అంటే మంచి గంధపు చెట్టు. దీనినే శ్రీఖండము,మలయజము అంటారు. చందన గుణం అంటే చందన వృక్షం యొక్క పరిమళ భరితమైన లక్షణం అన్నమాట.

ఈ చందన వృక్షం ఏం చేస్తుంది. తానున్న పరిసరాలను తన పరిమళాలతో గుబాళింప జేస్తుంది. తన సమీపమున ఉన్న ఇతర జాతి వృక్షాలకు, చుట్టూ ఉన్న చెట్లకు సైతం తన సుగంధాన్ని లభింప జేస్తుంది.×

అందుకే చందన వృక్షాన్ని మానవీయ విలువలు కలిగిన కూడిన వ్యక్తిత్వం, హృదయంతో పోల్చుతారు.

మానవీయ హృదయం ఉన్న వ్యక్తి ఏం చేస్తాడు.తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తన సుగుణాలతో మార్చేస్తాడు. సమాజ రుగ్మతలను తొలగిస్తాడు.

పూలను కట్టిన దారానికి పూలు తమ సువాసన ఇచ్చినట్లుగా చందన గుణం కలిగిన వ్యక్తి కూడా అలాగే ప్రవర్తిస్తాడు. అతని వల్ల కుటుంబం,కులం,మతం, జాతి ఏదైనా శోభాయమానంగా మారుతుంది.మంచి పేరు వస్తుంది.

అందుకే " కులములోన నొకడు గుణవంతుడుండిన/ కులము వెలయు వాని గుణము చేత/ వెలయు వనములోన మలయజంబున్నట్లు/ విశ్వధాభిరామ వినురవేమ " అంటారు వేమన తన పద్యంలో.

వంశంలో మంచి గుణాలు కలిగిన వ్యక్తి ఒక్కడు జన్మించినా అతని వల్ల కులం, వంశమే కాకుండా జాతికీ,సమాజం మొత్తానికీ మంచి పేరు వస్తుంది అంటారు.

మరి మంచి అంటే ఏమిటి...సత్ప్రవర్తన, సహృదయత,నీతి నియమాలు పాటిస్తూ ఎవరికీ హాని చేయకుండా సమాజ శ్రేయస్సు కోసం తపించడం, ఉన్నతమైన సమ సమాజ స్థాపన కోసం కృషి చేయడమని చెప్పవచ్చు. అలాంటి వ్యక్తుల వల్ల తరతరాల వంశ ప్రతిష్ట మరింత ఇనుమడిస్తుంది.

"ఎంత పెద్ద అడవి అయినా అందులో ఒక్క చందనపు చెట్టు ఉన్నా అడవి మొత్తాన్ని సువాసనతో నింపుతుంది కదా!" అనే అర్థంతో వేమన రాసిన పద్యం అక్షర సత్యం కదా!

అలాంటి కోవకు చెందిన జ్యోతిభా పూలే అంబేద్కర్, సావిత్రి భాయి పూలే, గాంధీ జీ,తిలక్ లాంటి ఎందరో మహానుభావులు సమాజ శ్రేయస్సుకు పాటు పడిన చందన వృక్షాలు.

మనిషన్నాక మానవీయ విలువలతో జీవిస్తేనే మలయజంలా సమాజంలో ప్రకాశిస్తాడని చందన గుణ న్యాయము ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రతి ఒక్కరం చందన వృక్షాలమై సమాజాన్ని పరిమళ భరితంగా మారుద్దాం.మన ముందున్న తరాలను చందన గుణ న్యాయమునకు అనుగుణంగా తీర్చి దిద్దుదాం.



-వురిమళ్ల సునంద
9441815722

## బంజారా నానీ

వారి చెమట
మోదుబారిన చెట్టు
చిగురు జెండాలు
తడికాన రాదు.



-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187



## ఆయన ఈనాటి నిలువెత్తు జ్ఞాన శిల్పం



తరాలుగా తరగని చిరునవ్వు
దిగంతాలకు పొంగుతున్న
జ్ఞాన సంద్రం
చిన్న చిన్నగా కురిసే చినుకులు
ఒక నదీ ప్రవాహానికి ఊతం
ఒక జ్ఞాపకం చరిత్రయితే
అది శాసనం
కథలు, ఊహలు కళాత్మక నిధులే!
అతడు భవిష్యత్తుకు
పూలబాట వేశాడు
వీళ్లు ముళ్ళు పరుచుకుంటూ వెళుతున్నారు
ఆయన సమతా పూలవనాలు పూయించాడు
వీరు విషబిందువులు చల్లుతున్నారు
అతడు మాట్లాడిన ప్రతి మాటా
గొప్ప ప్రవచనం
మోడు వారుతున్న జీవితాలను
చిగురింపజేసిన వనమాలి అతడు
వీళ్ల వేళ్ల నరకడానికి గొడ్డళ్లు నూరుతున్నారు
అతడు అంబేద్కరుడు
విశ్వజనీనుడు
కల్పనల గుట్టు విప్పిన పరిశోధకుడు
మానవతా స్వరాన్ని
శృతి బద్ధంగా ఆలపించిన గాయకుడు
అతని సంగీతం హృదయ రంజితం
అసలు సంగీతం అంటే ఏమిటి?
హృదయాన్ని కలిగించేదేగా!
మానసిక ద్వారాలు తెరిచేదేగా!
అందుకే ఆయన పాటే
ఈనాటి సంగీతం
అంబేద్కర్ జీవితమే ఈనాటి గీతం
ఆయన ఈనాటి నిలువెత్తు
జ్ఞాన శిల్పం
ఆ శిల్పం ఈరోజు గుండెలను పొంగిస్తుంది
మెదడును మేల్కొల్పుతుంది
ఆ రూపంలో నైర్మల్యత ఉంది
చైతన్య ప్రవంతులున్నాయి
విజ్ఞాన కాంతులున్నాయి
ఆయన రూపం ఒక పాలపుంత
ఆయన స్మృతి ఈనాడు
దేశాన్ని మేల్కొల్పుతుంది
ఆయనొక వివేచకుడు
కార్యకారణ సంబంధ
సమన్వేతుడు
ఆయన చార్వాక తత్వం
ఆయనే బౌద్ధ బోధనా స్రవంతి
ఆయన సాంకేతిక శిఖరం
అంకెలకు రెక్కలు తెచ్చిన
ప్రపంచ గణితుడు
అతడు ఎన్నో అడ్డుగోడలు కూల్చిన
సామాజికుడు
వీళ్లు తిరిగి కట్టాలనుకోవడం తిరోగమనం
ఆయన స్త్రీకి రత్న కిరీటం పెట్టాడు
వీళ్లు ముళ్ళ కిరీటం పెట్టాలనుకుంటున్నారు
ఇది మూఢ చర్య
ఆయన వాక్కుకు
పరిమళం తెచ్చిన వాచస్పతి
మానవ పరిణామాన్ని
దృశ్యీకరించిన శిల్పి
మానవత్వానికి హిమవన్నగం
తరగని ప్రజ్ఞానిధి అంబేద్కరుడు
ఆయన హస్తలిఖితమే రాజ్యాంగం
కాలాంతర సంధ్యలో
స్రవించిన వెలుగతడు
మానవుల్లోని విజ్ఞతకు
మెరుగు పెట్టిన స్వర్ణకారుడు
కంచెలు నాటే వారిని నేరస్తులని
ధ్రువీకరించిన రాజ్యాంగ కర్త
బహుభాషల్లోని
మూలమెరిగిన శాస్త్రవేత్త
బహుజనుల సమీకృతుడు
సంఘ ధర్మం నెరపిన బుద్ధుడు
మనిషి పుట్టుకకు భాష్యం చెప్పిన
అసితకేశ కంబలుడు
అతడు సాంఖ్యతత్వజ్ఞానుడు
ఆధునిక కపిలుడు
అతనిది లౌకిక జీవనం
అతడు అక్షరాన్ని నేలపై,
నీటిపై, గిరులపై, నాలుకలపై
రాసిన ప్రాకృతుడు
అతడు త్యాగానికి కొండగుర్తు
ఆవేదనతో అగ్గి రగిలించిన విప్లవకారుడు
శాంతిని,దాంతిని పంచిన నవయానుడు
ఆయనదే నేటి చరిత్ర
అతడే అంబేద్కరుడు
ఆయన చరిత్రే నవభారత గాథ
ఆ యుగ కర్త సుదీర్ఘ పథికుడు
ఆయన బాటలో మనం నడుద్దాం
నూత్న యుగాన్ని నిర్మిద్దాం.



-మహాకవి డా॥ కత్తి పద్మారావు
9849741695

## నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టిన 'విశ్వగీతం'!

పుస్తక సమీక్ష

**ధనమన్నది జనజీవన**
**మనుగడలకు మాధ్యమం-**
**ధన పిశాచులయిపోతే**
**ధరణి అగ్ని పర్వతం'** అంటూ కవి 'చకొనా' (చకిలం కొండల నాగేశ్వరరావు)గారు 'విశ్వ గీతం' పేరుతో ఓ దృశ్యకావ్యానికి జీవం పోశారు. వృత్తిరీత్యా న్యాయవాది. ప్రవృత్తిపరంగా సృజనకారుడు అయిన 'చకొనా' విశ్వగీతంలో సామాజిక స్పృహతో అనేక అంశాలను తమ కవితా వస్తువులుగా ఎంపిక చేసుకుని అభివ్యక్తిలో ఆర్తి, ఆర్ధ్రతలకు చోటు కల్పించారు. మానవ సంబంధాలు.. కుల మతాలు.. పర్యావరణం.. కర్షక కార్మికుల వెతలు.. యువతరం సంవేదనలు.. రాజకీయాలు తదితర అంశాలను కవితా వస్తువులుగా ఎంపిక చేసుకుని తమదైన శైలిలో.. తమ భావాలను వస్తువుల వెలుగులో దృశ్యమానం చేశారు. ఆయన సామాజిక దృక్పథం.. లోక పరిశీలనం.. ఉత్తమ సంస్కారం వంటి అంశాలు ఆయన కవితలకు ఆభరణాలైనాయి!

18 ఖండికల్లో.. దీర్ఘ కవితవోలే రూపుదిద్దబడిన ఈ కావ్యం.. దీర్ఘ కవిత అని చెప్పలేం.. గేయ దృశ్యకావ్యంగా మలచబడిన రచన యిది! ఇందలి కవితల్లో కవి 'చకొనా' ఆవిష్కరించిన భావాలు ఉన్నతంగా ఉన్నాయి. సామాజిక చైతన్యానికి.. పఠితుల్ని ఆలోచింప జేయడానికి వీలుగా కొలువుదీరాయి. సమస్యను ఎత్తి చూపితే కవి యొక్క బాధ్యత పూర్తికాదు. దానికి పరిష్కారాన్ని చూపగలగాలి. అప్పుడే అది కవిత్వంగా నిలబడుతుంది. కవిగా మనగలుగుతాడు. ఈ క్రమంలో 'చకొనా' తమలోక పరిశీలనను, జీవితానుభవాన్ని రంగరించి రాసిన ఇందలి కవితలు సమాజాన్ని కొంతమేరకైనా చైతన్యపరుస్తాయి. పఠితులకు దిశానిర్దేశం చేస్తాయి. కానీ పరిష్కార మార్గాలను సూచిస్తే మరీ బాగుండేది!

సమాజంలోని మనుషులు ఎలా మసలుకోవాలో మతాలు కలాలు కాదు. మానవత్వంతో మసలుకోవడం ప్రధానం అన్న అర్థం ధ్వనించే విధంగా కొన్ని కవితలకు కవి రూపమిచ్చారు. కర్షక, కార్మికుల వ్యథలకు అద్దం పట్టారు. వారి తలరాతలు మారడానికి పాలకులు, ఏం చేయాలో నర్మగర్భంగా సూచించారు. ధనం జనజీవన మాధ్యమంగా ఉండాలనీ ధన పిశాచులై.. ధరణిని అగ్ని పర్వతంగా మార్చవద్దని హితవు పలికారు.



ప్రతులకు:
చకిలం
కొండల నాగేశ్వరరావు
సెల్: 9885797375

మానవగతి తిరోగమన బాట పట్టకుండా.. ఆశ, స్వార్థ వ్యామోహపు లావాలో మునగవద్దని సూచించారు.

**ఆడదంటే దేవతేగా**
**సర్వశక్తి నిక్షిప్తం-**
**ఆదిశక్తి మూలమేగా**
**సకల సృష్టి ప్రహేళికం** అంటూ మహిళ ఔన్నత్యాన్ని చాటి చెబుతూనే..
**ఆదిశక్తి దేవతంటూ**
**పూజలు చేస్తూనే ఉంటావు**
**అమ్మ, చెల్లి, ఆలి కూడా**
**ఆడదనే మరుస్తావు** అంటూ ఆవేదనను వ్యక్తపరిచారు.

మసకబారుతున్న మానవ సంబంధాలను ప్రస్తావిస్తూ రాసిన కవితలూ ఈ చిన్ని పుస్తకంలో తారసపడతాయి.

**అన్నదమ్ముల మధ్య**
**ఆప్యాయతలు లేవు-**
**తల్లిదండ్రుల పట్ల**
**భక్తిభావమే లేదు**
**భార్యా,భర్తల్లోన**
**ప్రేమ బంధాలే కరువైనాయని** కవి 'చకొనా' తమ భావాలను బాధతో ప్రకటించారు. 'వసుధైక కుటుంబాలు' దిశ తప్పిన నినాదాలు కాకుండా జాగ్రత్త పడాల్సిన ఆవశ్యకతను నర్మగర్భంగా నొక్కి వక్కాణించారు.

**రైతన్న వెతలను తెలియబరుస్తూ..**
**ఒకవైపున వేధించే**
**ప్రకృతి కష్టాలు**
**మరోవైపు జాలిలేని**
**పాలకవర్గ నాటకాలు-**
**మధ్యలోన నలిగి-రగిలి**
**వడలొతున్న జీవాలు** అంటూ వాపోయారు.

**ఒక్కో చెమట చుక్క కూడా**
**కొహినూరు**
**కన్నావిన్నా** అంటూ కర్షకుని గొప్పదనాన్ని చాటి చెప్పారు.

**జన జీవన సౌందర్యం**
**కార్మిక జీవన స్వప్నం-**
**జాతి,రీతి, ఖ్యాతులన్నీ**
**నాటి కళా దర్పణం..** అంటూ
అలనాటి శిల్పకళా
సౌందర్యాఇశ్రీన్న మహా మహా మందిరాల చెదిరిపోని కళాకృతులను ప్రస్తావించిన తీరు బాగుంది.

ఆధునిక యువత గురించి తెలియజెబుతూ.. లక్షలు పోసి చదివినా..

లక్షణంగా బతుకు లేదని వ్యాఖ్యానించారు. నవయువకుల పాత్రలే కపోతే.. భువి కెక్కడ సౌభాగ్యం? అంటూ ప్రశ్నించారు.

ప్రకృతి యొక్క ప్రాశస్త్యాన్ని వివరిస్తూ.. ప్రకృతి విధ్వంసంపై కవి 'చకొనా' తమ బాధను వ్యక్తపరుస్తూ- పర్యావరణ పరిరక్షణ ఆవశ్యతను తెలియజేస్తూ రాసిన కవితలు కూడా ఇందులో దర్శమిస్తాయి.

ఇలా అనేక సామాజికాంశాలకు చోటు కల్పిస్తూ నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టిన కవి 'చకొనా'గారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

కవిత్వం, కవిత్వంలా ఉంటేనే.. పఠితులు అనుభూతిని పొందుతారు. మినీ వ్యాసంలా రూపుదిద్దుకోకుండా కవి జాగ్రత్తపడతారని ఆశిద్దాం.. మున్ముందు పూర్తి స్థాయి కవిత్వంతో 'చకొనా'గారు రావాలని కోరుకుందాం.



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## అమృతాభిప్రాయం...

ఎన్నెన్నో ప్రాంతాలున్న ఒక స్వతంత్ర దేశంలో.. ఒక ప్రాంత కబంధ హస్తాల్లో చిక్కుకున్న మరో ప్రాంతం వారు అందరికీ దొరికి తమకి దొరకని స్వేచ్ఛ కోసం ఎన్నెన్ని ఉద్యమాలు చేయవలసి వచ్చిందో తెలంగాణ ఉద్యమ చరిత్ర చదివితే తెలుస్తుంది!

**'స్వేచ్ఛ లేని బతుకు నాకెందుకు ? నాదైన ఇల్లు నాకు ముద్దు కాదె!'** అనుకుంటూ- తమదైన సొంత గూటి కోసం సాగే ఉద్యమంలో ...

ఎంత మంది విగత జీవులవుతారో, ఎంత మంది కాల్జేతులు విరగ్గొట్టుకుంటారో, ఎన్ని బలిదానాలు చేయాల్సి వస్తుందో , ఎన్ని చేతులు పిడికిలి బిగించాలో, ఎన్ని రకాల పోరాటాలు చేయాలో, ఎంత సుదీర్ఘ కాలం పడుతుందో ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమాన్ని పరికిస్తే తెలిసొస్తుంది!

సుమారు నలభై అయిదేళ్లుగా సాగిన 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమం' తీరు తెన్నులను



..విశేషించి- 'ఉమ్మడి నిజామాబాదు జిల్లా'కి సంబంధించిన ఉద్యమకారుల, సాహితీవేత్తల, ప్రజాగాయకుల, రాజకీయ వాదుల, విద్యార్థుల, కర్షకుల, కార్మికుల, తుదకు సకల జనుల పోరాటాన్నీ, కాంట్రిబ్యూషన్‌నీ ..తుర్లపాటి లక్ష్మీశంకరులిద్దరూ ఎంతో శ్రమకోర్చి - 'తెలంగాణ ఉద్యమ సాహిత్యం' పేర ఒక బృహత్ గ్రంధం వెలువరించడం ఎంతో హర్షించదగ్గ విషయం!

'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన నా వల్లే ..' అనుకుని చంకలు గుద్దుకునే వాళ్లందరికీ చెంపపెట్టు ఈ పుస్తకం ! ప్రతి జిల్లాలోనూ ఆయా జిల్లాల ప్రత్యేక రాష్ట్రోద్యమానికి సంబంధించిన ఇలాంటి పుస్తకాలు రావాలని కోరుకుంటూ...ఎంతో ఓపిగ్గా ఎన్నో వివరాలు సేకరించి...వాటినన్నింటినీ పొందు పరుస్తూ పుస్తకం వెలువరించిన లక్ష్మీ శంకరుల ద్దరినీ అభినందిస్తూ...



- డా॥ అమృత లత
సెల్: 9848868068

## ఆదివాసీ జీవితాలకు అద్దంపట్టే కవిత్వం 'శతసమీర'



డాక్టర్ నలుబోల విజయ్‌కుమార్ రాసిన 'శత సమీర' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు.

నలుబోల విజయ్‌కుమార్ ఆదివాసీల జీవితాలను అద్భుతంగా కవిత్వీకరించారంటూ ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ మురళీకృష్ణ కొనియాడారు. ఆయనను ప్రకృతి కవిగా అభివర్ణించారు. గిరిజన సహకార సంస్థలో ఉద్యోగం చేస్తున్న విజయ్ ఈ పుస్తకం ద్వారా స్ఫూర్తి కలిగించే కవిత్వాన్ని పాఠకులకు అందించారని కొనియాడారు. హైదరాబాద్ పుస్తక మహోత్సవంలో రవ్వా శ్రీహరి వేదికపై సోమవారం డాక్టర్ నలుబోల విజయ్‌కుమార్ రాసిన **'శత సమీర'** కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ మన్యం జీవితాలు ఇతివృత్తంగా హృద్యమైన కవిత్వం రాశారన్నారు. కవితల్లోని పదబంధాలు మనసుకు హత్తుకొన్నాయంటూ, కొన్ని పంక్తులను సభలో ప్రస్తావించారు. విజయ్‌కుమార్ విశాల హృదయానికి ఇందులోని కవితలన్నీ అద్దం పడుతున్నాయన్నారు. సినీ దర్శకుడు రమేష్‌రాజు మాట్లాడుతూ ఇందులోని కవిత్వం పాఠకులకు ఆనందాన్ని ఇస్తుందన్నారు. విజయ్‌కుమార్ రచనల ఇతివృత్తంగా త్వరలో సినిమా రూపొందించనున్నట్లు తెలిపారు. కవి యాకూబ్, బుక్ ఫెయిర్ నిర్వాహకులు జూలూరు గౌరీశంకర్, ఆర్. వాసు, కోయ చంద్రమోహన్, టి. రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమంటే...!

చూపుల్లో కలిసి
శరీరాల్లో సమసేది
కాదు ప్రేమంటే ,
అవసరాల్లో దాగుండి
విలాసాల్లో విచ్చుకునేది
కాదు ప్రేమంటే ,
నచ్చిన రూపాలు మెచ్చిన
కానుకలు కురిపించేది
కాదు ప్రేమంటే.
పర్యవసానాల బేరీజు
వేయకుండా జీవితాలను
చేజార్చేది కాదు ప్రేమంటే,
నేను
అనే స్వార్థాన్ని చిమ్ముతూ
తుప్పర్లను పదిమంది పై
విసిరేది కాదు ప్రేమంటే,
కళ్ళకు తెలిసిన నిజాన్ని
కనురెప్పల కైనా తెల్పక
వెన్నెల వెలుగులు కన్నుల్లో
నింపుకునే మెరుపు ప్రేమ.
భాషతో సంబంధం లేక
సంభాషణ కొనసాగించే
అనూహ్య అనుబంధం ప్రేమ.
మనిషికి మనసుకు ముడి
వేయకుండా చేసే ఆత్మల
కరచాలనం ప్రేమ .
ఇవ్వటమే కానీ
తీసుకోవటంతెలియని
అమాయక గుణం
ప్రేమ .
బంధాల
బొంగరపు ఆటలో
ఏ వైపు ఆగాలో తెలియక
నిత్యం నలిగే నరం ప్రేమ.
ఎన్నో అంతర్మదనాల మధ్య
మనిషి జీవితంలో దొరికిన
గొప్ప వరం ప్రేమ.
అసూయ, ద్వేషాల
కుమ్ములాటలో విముక్తి
గీతం ప్రేమ.



-షేక్. నసీమాబేగం
9603567011

## మణిపూసలు

భావుకత్వం పండాలి
రసవంతంగ ఉండాలి
ఆస్వాదించినంతనే
ఎదలోగిళ్లు నిండాలి!

కావ్యాలనే చదవాలి
కవిత్వమయ్యి కదలాలి
హృదయాలను తాకుతూ
పఠితులలోన నిలవాలి!.

అడుగులు కలిపి నడుద్దము
అవినీతినిక తర్మదము
మసిబారిన మానవతా
దర్పణమును తూడుద్దము!

వాగ్దానాలు మరుస్తరు
కొత్త హమిలాను యిస్తరు
ప్రతిపక్ష పార్టీలపై
బురద వెదజల్లుతుంటరు!

ఇప్పటి టీనేజర్లు
స్మార్టుఫోను యూజర్లు
వాట్సప్ ఫేస్ బుక్కుల్ని
ప్రేమించేటి లవర్లు!

నిర్లక్ష్యం రానీయకు
కానిదేది ఆశించకు
నిరాశకు గురియౌతు
లక్ష్యాన్నెన్నడు వీడకు!

చెలిమిని చెడనీయకు
కలిమిని విడిచేయకు
మనిషి మనిషికి మధ్య
దూరం పెంచేయకు!

మనస్సు బలంగుండాలి
ధైర్యం వీడకుండాలి
ఏ పరిస్థితి ఎదురైన
నీ విశ్వాస ముండాలి!

ఆటుపోట్లకు బెదరక
అపనిందలకు చెదరక
నిలబడ గలిగితెనే
ధీరుడవనే పోలిక!

రెప్ప వాలితే చీకటి
విప్ప గలిగితదే దివిటి
బ్రతుకు పరమర్థమిదే
అర్థం కాలే దేమిటి?.



-యన్.వి.రఘువీర్ ప్రతాప్
సెల్:9440551552.

## షట్పదులు

నీతి నిజాయితీ విస్మరిస్తే
గోతియే కడకు దిక్కవుతుంది!
ధనార్జనకై దానవుడైతే
దండిహీన చరితవుతుంది!
కన్నవారినీ అవమానిస్తే
కడకు నరకమే నీదవుతుంది!

ఏ ఎన్నిక లొచ్చినా
ఏదో విధి 'రిగ్గింగే'!
ఏ పాలకుడొచ్చినా
'బడ్జెట్'లో 'బెగ్గింగే'!
అమాయక జనావళికి
అదే పనిగ 'ర్యాగింగే'!



- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699





# జన రంజక కవి ప్రతిభా పురస్కారాల పదేళ్ళ చరిత్ర



అందరికీ నమస్కారం. నేను మచిలీపట్టణం ఆంధ్ర జాతీయ బి.ఎడ్. కళాశాలలో పదవీ విరమణ చేయటానికి నాలుగు సంవత్సరాలు ముందు 2006లో "రావి రంగారావు సాహిత్య పీఠం'' స్థాపించటం జరిగింది. కొన్ని కార్యక్రమాలు, పుస్తకాల ప్రచురణ జరిగింది. 2014లో గుంటూరుకు మకాం మార్చగానే ప్రత్యేకాంధ్ర ఏర్పడిన సందర్భంలో "గుంటూరు జిల్లా రచయితల సంఘం"తో కలిసి ఆర్.వి.ఆర్.ఆర్. బి. ఎడ్. కళాశాల లో జూన్ 22న ఉదయం నుండి సాయంత్రం దాకా "సీమాంధ్ర కవి సమ్మేళనం" నిర్వహించటం జరిగింది. ఇందుకు ఆ కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రావెల సాంబశివ రావు, గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య చక్కగా పీఠానికి సహకరించారు. వంద మందికి పైగా కవులు పాల్గొన్నారు.

2014 నుండి జన రంజక కవిత్వం ప్రోత్సహించాలనే ఉద్దేశంతో "జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు" మొదలుపెట్టటం జరిగింది. పద్యాలు, గేయాలు, వచన కవితలు, మినీ కవితలు, బాల గేయాలు, లఘు కవితల సంపుటాలు... ఒక్క ముక్కలో చెప్పాలంటే కవిత్వ గ్రంథాలకు ఈ పోటీ నిర్వహిస్తున్నాం.

పోటీకి ఏదో ఒక పుస్తకం ఎంపిక చేసి పురస్కారం ఇవ్వటానికి బదులుగా బాగున్న మంచి పుస్తకాలను కొన్నిటిని ఎంపిక చేసి బహు పురస్కార విధానాన్ని ప్రవేశపెట్టటం జరిగింది. ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఏడు పుస్తకాలను ఎంపిక చేసి ఏడుగురు కవులకు పురస్కారాలు అందించటం జరిగింది. క్రమం తప్పకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి పదేళ్ళ నుండి కొనసాగిస్తూ వస్తున్నాం. ఇప్పటికి అరవై మంది కవులు మా పురస్కారాలు అందుకున్నారు. కరోనా కాలంలో కూడా పురస్కారాలు అందించాం.

ఇప్పుడు ఇస్తున్నవి 2023 పురస్కారాలు పదోవి. ఈ సారి కూడా ఆరు పుస్తకాలు ఎంపిక చేసి ఆరుగురు కవులకు ఈ నెల 14న అన్నమయ్య కళా వేదిక,లో ఏర్పాటు చేసిన సభలో పురస్కారాలు ఇవ్వడం జరిగింది.

ఈ సంవత్సరం పురస్కారాలు పొందిన కవిత్వ గ్రంథాల గురించి సంక్షిప్త సమీక్ష ఇదిజ

### శ్రమకు పట్టాభిషేకం శివకుమార్ కవిత్వం (మొలగొలుకు చేను)




శ్రమకు పట్టాభిషేకం చేసే చక్కని కవిత్వం రాసిన కవి పేరిసెట్ల శివకుమార్. నిరాడంబర మైన శైలిలో నిప్పు లాంటి కవిత్వం రాసారు. కార్మికులగురించి కర్షకులగురించి కమ్మని అక్షర దేవాలయాలు నిర్మించిన కవి. దేశ భక్తి, అవినీతిపై పోరాటం, మంచి మనుషుల మీద అభిమానం, అసమానతలు లేని సమాజం గురించి ఆరాటం శివకుమార్ కవిత్వంలో ప్రముఖంగా కనిపిస్తాయి. కవిత్వంలో అందమైన నెల్లూరు గ్రామీణ నుడికారం పాఠకుల్ని అలరిస్తుంది.

"సీతారాములోరి కోసం పేనా లొదిలిన కోతిన్నేను. కురుచేత్రరం కొట్లాటలో ఊపిరి పోయిన సైనికుణ్ని నేను, నా నెత్తుటి ఆవిరే ఈ జాతికి ఇంధనం, నా ఊపిరి యచ్చదనమే ఈ లోకానికి పొద్దు పొడుపు, నా కండల కరుకుదనమే ఈ నేలకి ఎక్కడ లేని ముడుపు, నా ఎన్నేముకతో ఈ జాతి జలపాతానికి ఆనకట్ట కడుతుండా" అని "పని పురుగు" శ్రమజీవికి పెద్ద పీట వేస్తారు.

" ఈ నేలను మొలిచిన ఓంకారం, ఆ నింగిని పొడిచిన నెలవంక, పెనవేసుకొని పేగు బంధాలైనప్పుడే జాతి వృక్షం జటాఝూటం విస్తరిస్తుంది" అని హిందూ ముస్లిం సమైక్య అవసరం నొక్కి చెబుతున్నారు. "సరిహద్దుల్లో సైనిక తపస్సు చేస్తున్న రక్షక ఋషులు రాత్రింబవళ్ళు భద్రతా యజ్ఞం చేస్తున్నా ముష్కర మేనకల చౌరబాటు నాట్యంతో ఉగ్రవాద శాకుంతలాలు ఉద్భవిస్తూనే ఉన్నాయి" అని దేశ భక్తితో కూడిన ఆవేదన కనిపిస్తుంది.

పైరును చూసి ఎన్ని రకాలుగా అద్భుతమైన అనుభూతులు పొందుతారో కవి అని ఆనందం కలుగుతోంది. "మొలగొలుకు పైరును మనసు కళ్ళతో చూస్తే నారదుగప్పుడు కొత్త పెళ్ళిన కూతుర్లా ఉండేది, నాటిన నెల లోపు నాయుడు బావని ముద్దాడే ఎంకిలా ఉండేది... ఎన్నుతీతలప్పుడు నీళ్లోసుకున్న నిండు గరిబిణీలా ఉండేది, వరి కోతలప్పుడు వైకుంఠం దిగివచ్చిన లచ్చిందేవిలా వుండేది" అని పరిపూర్ణ మైన రైతు హృదయం కనిపిస్తుంది.

"హస్తవాసిలో అపర ధన్వంతరి, నిరాడంబరతకు నీలకంఠుడు, నిశీధిలాంటి బతుకు శ్మశానంలో కాటి కాపరి బతుకీడ్చిన కారణజన్ముడు మా నాన్న" అంటూ తండ్రి గురించి తలచుకుంటారు.

"వ్యక్తుల మీద కోపాన్ని వ్యవస్థ మీద చూపిస్తే, చెరువు మీద కోపంతో ప్రాజెక్టును పగలగొట్టినట్టే" అంటూ పగతో రగిలే మనుషులకు గట్టి సందేశం ఇస్తున్నారు.

"మణుసుల్నిగొడ్డులనుండి ఏరు జేసే గుడ్డపాతలని కనిపెట్టిన నూలు దేవుళ్ళం మొగ్గ సప్పుళ్ళతో సూరీణ్ణినిదర్లేపి కండిలు రాటంతో చీకట్ని తోడిన మేము చిరుగుడ్డల్లో సిగ్గును దాసుకుని పొస్తుల దీపంతో ఆకలి మసకలో బతుకీడస్తా ఉండాం" అంటూ చేనేత పరువు గొప్పతనం వర్ణిస్తారు.

ఎన్నికల తతంగం గురించి ఆవేదన కవిది. "జెమెందారీ జెర్రి పోతులు పెత్తనం బుసలు కొడుతున్నాయ్, కుల పిచ్చి విషాన్ని కోరల్లో నింపుకొని, పాత కామందులు "పట్టు" పంచెలు బిగిస్తున్నారు, అధికార ప్రేయసిని హత్తుకోడానికి, అయిదేళ్ళ జాతర పాడెను భుజం మార్చిడీ రెక్కీ చేస్తున్నారు" అంటూ ఎన్ని పార్టీలు మారినా జనానికి ఒరిగిందేమీ లేదని వాస్తవం గమనించారు.

"పాలక పక్షానికి పంటికింద రాయిలా, ప్రతిపక్షానికి చదరంగంలో పావులా, చానెళ్లకు వేడి వేడి వార్తలా... ఆకలి మంటకు అన్నం పెట్టేవోడు ఆరని మంటలా వున్నాడు" అంటూ రైతుల బాధల్ని, రైతు పోరాటాల్ని గుర్తు చేస్తున్నారు.

"అడుక్కునే కుంటోడి చేతిలోని సత్తు గిన్నె సొట్టలో ఆయనుంటాడు, చెమటారిన మొహం మీది జిడ్డులో తను మిసమిసలాడుతుంటాడు" అని దేవుడు ఉండే ప్రదేశాల్ని కవి దర్శించటం విశేషం. డబ్బు కోసం దుర్మార్గ మార్గాలలో సిగ్గు లేకుండా తిరుగుతున్నా మనుషుల్ని చూసి చూసి "ధన పిశాచుల మనీ మేనిఫెస్టోని మడత పెట్టే మంచి రోజు కోసం ఎదురుచూస్తున్నా" నంటున్నారు కవి.

కవిత్వం రాస్తే కడుపు ఖాళీ గిన్నెయినా మనసు నిండు కుండ అవుతుందని నమ్మకం ఉన్న కవి శివకుమార్ అభినందనీయులు.

### మతాన్ని మించిన మానవతా వాదం రహీమొద్దీన్ కవిత్వం. (కలల రంగు)

"నిండల చీకట్లలో నా నిజాయితీ చాందినీ దీనంగా ఆరిపోతాంటే చీకటి




జంతువు తినగా మిగిలిన నెలవంకను నేను" అనే సామూహిక ఆవేదనకు అక్షర రూపం ఇస్తున్నారు కవి.

"ఎన్ని దీపాలను వెలిగించినా నా చేతి పగుళ్ళలో పేరుకుపోతూ నల్లని చీకటి" అంటున్న కవి రహీమొద్దీన్.

"మతాన్ని గుళ్ళో నుంచి రథ మెక్కించి పోలింగ్ బూతుదాకా మోసుకొచ్చినావ్, కుర్చీ కొరకే నా వెంటపడి వెంటపడి నన్ను ఒంటరిని చేయాలని చూస్తున్నావ్" అంటున్న కవి రహీమొద్దీన్. మత భేదాలు కుల భేదాలు రాజకీయాల సృష్టి అనే "అందరికీ తెలిసిన రహస్యం" మళ్ళీ మళ్ళీ కవులు చెబుతున్నా ఇంకా చాల మందికి ఎక్కటం లేదు. "నా చుట్టూ నాలుగు గోడలు కట్టి నా వక్తిత్వాన్ని సమాధి చేసినాక అది పుట్టిల్లు అయితే ఏమిటి మెట్టినిల్లు అయితే ఏమిటి రెండూ నా రెక్కలను విరిచినవే" అంటూ స్త్రీ మూర్తుల ఆవేదనకు అక్షర రూపం కవి కవిత్వం. "ఇంట్లోని చెత్తను వూడ్చేసినట్లే మగ బుద్ధిని కూడా ఈ చీపురుతో శుభ్రంగా ఊడ్చేస్తే బాగుండు" నంటారు కవి.

"పట్నం పులి పంజా విసురుతున్నది దరిదాపుల్లో ఉండటమే పంట పొలం చేసుకున్న పాపం " అంటూ పెరుగుతున్న నగరీకరణ, రియల్ ఎస్టేట్ వ్యాఆరం కోరల పదును గురించి కవి ఆవేదన ప్రజలకు ఎక్కాల్సిన అవసరం ఉంది. "పాలిచ్చే రొమ్మును కోసినట్లు కరెన్సీ కత్తి పొలాన్ని ముక్కలుగా కోసి అమ్ముతున్నది" అంటారు. "అన్నం పెట్టే రైతును, ఆడ పిల్లను కన్నతండ్రిని తలెత్తుకొని బతకనిచ్చే దేశమా ఇది" అని ప్రశ్నిస్తారు.

"అమ్మను ఏడిపిస్తే నాన్నయినా నాకు శత్రువే, కాదు కాదు లోకంమీద ఎవరిని ఎవడు ఏడిపించినా వాడు నాకు శత్రువే" ఇలా అనటంలోనే రహీమొద్దీన్ కవి ప్రత్యేకత.

ఇంత సింపుల్ గా గొప్పగా కవిత్వం రాయటం ఈ కవిని చూసి మాటల మాయల కవిత్వం రాసే కవులు చాలా నేర్చుకోవాలి. "అయ్యో, ఈ మాటలు నేనెందుకు చెప్పలేకపోయాను" అని నిజమైన కవులు అసూయపడతారు. సాటి మనిషి ఎవ్వడు ఇబ్బందులు పడకూడదనే కోరికలోంచి కవి కవిత్వం పుట్టుకొచ్చింది.

"చప్పట్లు కొట్టే మన వాళ్ళనందరినీ లోయలోనే వదిలేసి ఏ గెలుపు శిఖరాన్నో అధిరోహిస్తే మాత్రం ఒంటరిగా ఏం చేస్తామక్కడ" అనే గొప్ప సంస్కారం కవికుంది.

దేశంలోని ఊసరవెల్లి మేధస్సును ఎండగడతారు. "మనిషిని ప్రేమించినవాడు పంట కాలువై సరసరా మనుషులలోకి ప్రవహించకుండా గిరి గీసుకొని ఉండలేడు''... సేవా మూర్తుల గురించి ప్రశంసల వర్షం కురిపిస్తారు కవి. భవన నిర్మాణ కార్మికుల్ని మనుషుల కలల నిర్మాణ కార్మికులు అంటారు. వివిధ వృత్తులలో పని చేస్తున్న శ్రమజీవులకు తమ కవిత్వంలో పట్టం కట్టారు కవి.

'వాడెప్పుడు మెదడు నిండా మత్తును వెదజల్లుతూనే ఉంటాడు పదునైన ఆలోచనలు జాగ్రత్త యుద్ధం ఇంకా మిగిలే ఉంది" అంటూ జన చైతన్య ఆవశ్యకత ప్రబోధిస్తారు.

### మనసున్న మన్ను పండించే నీటి గింజలు కంచరాన కవిత్వం (నీటి గింజల పంట)




"మనసున్న మన్ను మనిషిపై చిలికే మమత గురించి పదాల ప్రయోగశాలలో అనియతంగా పరీక్షిస్తాను'' అంటున్న కంచరాన భుజంగరావు మాటలను బట్టి ఆయన వసువు, శైలి స్పష్టం అవుతున్నాయి. "అపరిచిత ప్రపంచంలో మిత్ర బృందాన్ని వెతుక్కొని ముఖ పుస్తకాలకు అతుక్కొని చెలిమి చిగురించని ముఖచిత్రం నేను" అంటున్న మాటలలో కనిపిస్తున్నది ఆయన కాదు... ఈ నాటి మనిషి.

"చిన్న గొట్టంతో బస్తా పొట్టలోకి పొడిచి కొన్ని కేజీల బియ్యం కాజేసినంత లాఘవంగా బడ్జెట్ దేహం నుండే నేరుగా కొన్ని జలగలు" చూసారు కవి. " దేశం ఆకలంతా నాగలి నెత్తి మీదే కూర్చొనుంది... నిత్యం చీకట్లో మగ్గిపోతూ మట్టి మడిలో ఒక్కో విత్తుని ఒక్కో దీపం చేసి వెలిగించినవాడు"అని రైతు అభిమానం ఉన్న కవి.

"నేతల యుద్ధోన్మాదానికి నెత్తుటి ముద్దలై మిగిలే కన్నా దేశ మేదైనా ప్రజ లెవరైనా యుద్ధాన్ని నిరసించడమే... పౌర విధి" అనే ప్రపంచ శాంతి కాంక్ష కవిది. "ఊరంత నోరేసుకొని ఊదరగొడుతున్న మంత్రవాదులు మనమనీ మనదనీ మచ్చిక చేసుకొని మనకంటూ ఏదీ మిగలనీయకుండా" చేస్తున్న పెద్ద మనుషుల కుట్రల గురించి చక్కగా హెచ్చరిస్తున్నారు కవి.

"చిరు చిరు క్షణాల కాంతి గోళాలని ప్రోది చేస్తున్న చిట్టి చేతుల మాతల్లి పాల పెదవుల మధ్య వికసిస్తున్న ముత్యపు నవ్వుల నెలవంక" అంటూ కన్న బిడ్డల్ని అందమైన కవిత్వం చేసారు.

"ఏపుగా పెంచుకున్న భాషా సంస్కృతుల పంటంతా బూతు తెగులు సోకి తల దించుకుంది" అంటూ మనుషుల్లో పెరుగుతున్న అశ్లీల వైఖరిని ఎండగడుతున్నారు. "చెడు తలపు రోగానికి ఒక సేల్ఫీ బొమ్మ. మంచి ఆలోచన రెట్టలు వేసినా పిట్టల్ని చేరబిలిచే చెట్టు కొమ్మ" అంటూ ఎంతో ఉదాత్తంగా సంస్కార చిత్రణ చేసారు.

"కవిత్వంతోనే నా ఊపిరి వెలిగించుకుంటాను. కవిత్వంలోనే నా ఆయువు పోదిగించుకుంటాను" అనికోరుకుంటున్న కవికి శుభాకాంక్షలు,

### రాగుల పంటను రాయల సీమను ప్రస్తుతించే యాములపల్లి




(రాగుల సీమ)



రాయలసీమలో పండే రాగుల పంట గురించి, రాయల సీమ గొప్పతనం గురించి, రాయలసీమకు జరుగుతున్న అన్యాయం గురించి, దోపిడీ గురించి సుదీర్ఘ కావ్యంలో అద్భుతంగా చిత్రించారు కవి యాములపల్లి నరసిరెడ్డి. రాగుల పంట గురించి తాసిన కవి గారి మాటలలో రాగులు ఎంత గొప్ప ధాన్యమో అవగత మవుతుంది.

"సూర్యుని చుట్టూ తిరిగే భూమిలా
రాగుల చుట్టూ తిరుగుతాయి మా జీవితాలు,
రాగులంటే రాగులా అవి
సీమ తల్లి కన్నెర్రలోంచి జారిపడ్డ
నిండు దోసెడు నెత్తుటి బొట్లు"
"ఎరుపులోంచి పుట్టిన పచ్చదనం
పచ్చదనంలోంచి పుట్టిన ఎరుపు గింజలు రాగులు
రాళ్ళల్లో రాళ్లై రాళ్ల మధ్య బతకడమంటే
రాయిలాంటి తిండే తినాలి"
"పండు కంకులతో కోతకొచ్చిన రాగి చేను చూస్తుంటే
యుద్ధానికి మోహరించిన ఎర్ర శిరస్త్రాణాల సైనిక పటాలంలా
నేల జెండాపై గీచిన రక్త వర్ణ చిత్రంలా..."

రాయలసీమ గురించి కూడా అద్భుతమైన కవిత్వం పండించారు కవి.

"ఎవరైనా ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రాంతాన్ని రక్షించుకుంటారు
మా వాళ్ళు నీళ్ళను తృణప్రాయంగా ఎంచి
పదవుల వెంట పరిగెత్తారు"
"పాలకులు వెలగబెట్టిన పనుల్లో
కాంట్రాక్టర్లు బాగుపదిందే కాని
ఏ రైతు బిడ్డా ఒక్క ట్రాక్ట రైనా కొనకపోగా
ఉన్న ఎద్దులని కూడా అమ్మరాని చోట అమ్ముకుంటున్నారు"
"ఒకడు బలిస్తే అందరు బలిసినట్లేనా
ఇద్దరి మధ్య కక్ష లుంటే
అందరి మధ్యా కక్ష లున్నట్లేనా"
"రాజుల కాలమే నయం
ఎవర్ని ఎందుకు చంపుతున్నారో
కూడలిలో తప్పెట కొట్టి చాటింపేసి కారణం చెప్పేవారు"
"మాది రాయలసీమ
బిగిసిన పిడికిలి లాంటి రాగి కంకులే మాకు స్ఫూర్తి
మా రాటపేఊగులు నిప్పులై రాగులుతున్నాయ్"

ఈ విధంగా రాగుల పంట విశిష్టత గురించి రాయలసీమ వెనకబడ్డ స్థితి గతుల్ని గురించి సుదీర్ఘ కవిత వెలయించిన యాములపల్లివారు అభినందనీయులు.

### ప్రభాత కిరణాల వంటి పాలపర్తి పద్యాలు (పద్య ప్రభాతం)




ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చిన ఉపాధ్యాయిని పాలపర్తి హవీలా. అద్భుతమైన భావుకతతో వర్ణనా నైపుణ్యంతో ఏక వస్తువు తీసుకొని ఎక్కడా ఆగకుండా కలాన్ని పరిగెత్తించిన కవయిత్రి హవీలా. ఒక్క సూర్యుడిని విషయంగా తీసుకొని రాసిన 142 పద్యాలు అన్నీ ఆణిముత్యాలే. ప్రతి పద్యం కవిత్వం చేయటానికి కవయిత్రి కృషి కొనియాడగినది. సూర్యుడి మీద దీర్ఘ కవితా కావ్యం వీరు రాసిన "పద్య ప్రభాతం".

మచ్చుకు కొన్ని పద్యాలు చూడండి.

"గలగలా స్వరములు పాడి కొలను నవ్వె,
కిలకిలారావములు వన కేళి సలిపె,
కళకళగ పంకజములు మొగ్గలను వైచె,
విమలుడు... ఇనుని వలపు కిరణములు సోకి"
"వేన వేల కిరణముల బీజములను
భాను డను కర్షకుడు విత్తబూనె నిలను,
బీజములె మొక్కలై మహా భూజములయె,
ప్రస్తుతింతు కర్శకుని మేల్ పనితనము"
"వెన్నెలల చల్ల కుండలో వెన్న వోలె
నింగి పర దిక్కునకు చేరె నీరజారి
మింట అగ్ని గోళ మొకండు మంట వేయ
వెన్న కరగె, మిన్నుల క్రమ్మె వెలుగు రేఖ"
"గణన చేయజాలని ఇర్ల గనుల నెన్నొ
త్రవ్వి అద్దరికిన్ త్రోయు శ్రామికుండు
శ్రమను చేయ ఆతని స్వేద హిమము కురియ
ప్రకృతి కుల కాంత క్రొత్త శోభలను కులికె.'

"తరణి మృదు కర స్పర్శ సంతసము చెలగి
ధరణి పులకించి రస రమ్యతల దలంచి
పరవశించుచు పాడిన పాట అనగ
పంట కాలువ గలగలల్ పలుకరించె"
"ముసురు చీకట్ల కంబళిన్ ముసుగు దన్ని
హాయి నిద్రించె భువి, తారకాళి శశియు
కంబళికి గల్గు చిల్లులై కళల గులుక
ముసుగు వెడలించి మేల్కొల్పె భువిని తరణి."
"పొద్దు పొలతి ఎర్రనివైన పూలు తెచ్చి
తూర్పు పళ్ళెమ్ములో వాటి ద్రుల్లి పేర్చి
నీలి నింగి సాగర మందు నీట వదల
ఎర్రని బతుకమ్మ రవియై ఇలను వెలిగె."
తెల్ల ఉంద్రాళ్ళ వేల్ రేయి తెమిలిపోయి
ఎర్రని అరిసెల పండుగ ఏగుదెంచి
అటుల శశి నిష్క్రమింపగ అపర దిశకు
తరణి ఏగుదెంచి హసించె కిరణ తతుల"
"భూమి నేలుదు రిరువురు పుడమి దొరలు
నిండయిన రాజధానులు రెండు కాగ
వెలుగు రేనిది మించు పచ్చల భవంతి
ధవళ కరునిదొ మంచు ముత్యాల మేడ"

### ప్రభుదాస్ పద్యాలు సరళ సుందర హృద్యాలు (కావ్య విపంచి)

తెలుగు నాటకాల మీద పరిశోధన చేసిన మంచి నటుడు ప్రభుదాస్ రాసిన




పద్య ఖండికల సంపుటి "కావ్య విపంచి". జాషువా ప్రభావంతో చక్కని పద్య ధారతో సామాజిక చైతన్యంతో సందేశ పరిమళాలతో వివిధ విషయాలమీద దేవరపల్లి ప్రభుదాస్ రచించిన పద్య ఖండికలు ఇందులో ఉన్నాయి.

**మాతృ భాష గురించి...**

"మాతృభాష పైన మమకారమును వీడి
చిన్నబుచ్చరాదు కన్న భాష,
అమ్మ నెవ్వరైన అవమాన పరతురా
తల్లి వంటి కల్ప వల్లి తెలుగు"

ప్రేమ బంధం గురించి...

"కలిమి పసిడి ధనము కాపురం బనరురా
చెలియ వలపె చెలగు జీవితంబు
ప్రేమ కరుణ రాగ ప్రేమానుబంధమే
సతి పతులకు దివ్య స్వర్గ సీమ"

బ్రహ్మనాయుడు గురించి...

"అరి భయంకర వీరుడై వరలె నెవరు,
సకల జనులను ఒకటిగా సాకె నెవరు,
సమత మమతల లోకాన చాటె నెవరు,
బ్రహ్మనాయుడు మహి వెల్గు భాస్కరుండు."

**కరుణశ్రీ గురించి...**

"మధుర మంజుల భావమ్ము మది దలిర్ప
సొగసు గుల్కెడి సుకుమార సొబగు లద్ది
లలిత లావణ్య పదముల లాస్య లహరి
పసిడి కవితలను వెలార్చె పాపయాఖ్యు"

**ఓటు గురించి...**

"ఓటన్న అయిదేళ్ళ బాటరా, బ్రతుకున
సుఖ జీవనంబును చూపు ఓటు
రౌడీల గూండాల రౌద్రంపు కార్యాల
నిర్మూలనము చేయు నిప్పు ఓటు'

**ఉషోదయం గురించి...**

"ఉదయ భానుని కిరణాలు ముదము గూర్ప
చెలగు మేఘంపు గుమి పూల చెండు కాగ
అరుణ సిందూర కాంతుల మెరయ చీర
నీలి వర్ణము నలరారె నింగి నెలత"

**మనిషి గురించి...**

"కడుపు కాలునపుడు కడుపు నిండగ జూచు
కడుపు నిండినంత కలిమి కోరు
కలిమి కలిగె నంత కావలె పదవిరా
పదవి రాగ కీర్తి నొదవ గోరు"

**కాఫీ గురించి...**

"పాల సంద్రమ్ము చిలికిన తేలె సుధయు
అది కలియుగంబు కాఫీగ అవతరించె
జుంటి తేనియ చక్కెర జున్ను నెయ్యి
కాఫి... అన్ని రుచుల కలగల్పు గాదె"

**అగ్గి పుల్ల గురించి...**

"అనల తేజమ్ము రూపమ్ము అగ్గి పుల్ల
అలరు చలి మంట, చితి మంట అగ్గి పుల్ల
అఖిల కాంతి విరాజిత అగ్గి పుల్ల
అసలు సిసలైన కవితయే అగ్గి పుల్ల.

కవులకు అభినందనలు, శుభాకాంక్షలు.

### ఇన్నటి వరకు జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు పొందిన పుస్తకాలూ, కవులు

చినుకు (బిక్కి కృష్ణ),
గరళం (మౌనశ్రీ మల్లిక్ఊ
విస్ఫోటనం నుంచి విధ్వంసం దాకా (యక్కలూరి శ్రీరాములురి
రాతి జల (డా. అద్దంకి శ్రీనివాస్)
ప్రపంచాక్షరి (గరిమెళ్ళ నాగేశ్వరరావు)
మాట (చిన్ని నారాయణరావు)
స్ఫూర్తి పాటలు (స్ఫూర్తి)
పౌరుష జ్యోతి, పద్యాలు (కొల్లా శ్రీక్రిష్ణారావుఊ
కాకి ముద్ద ( ఈతకోట సుబ్బారావు)
చూపుడు వేలుపై సూర్యోద యం (సరికొండ నరసింహరాజు)
ఒక మెలకువ (పి. శ్రీనివాస్ గౌడ్)
ట్రంకు పెట్టె (మోకా రత్న రాజు)
శిథిలాల మాటున శిల్పాలు ( మొహమ్మద్ ఖాన్)
సుందర సుందరీయం, పద్యాలు ( కలవకొలను సూర్యనా రాయణ)
వృక్ష శతకం (చిగురుమళ్ళ శ్రీనివాస్)
రేపు భూమి ముఖచిత్రం నా పోయెం (జనజ్వాల)
పూవులు సమ్మె చేస్తాయి ( ఏటూరి నాగేంద్రరావు)
ఈ మట్టి మనదే (ఎస్ఆర్ పృథ్వి)
చేను గట్టు పియానో (ప్రసాద మూర్తి)
మాట ముల్లు (గుర్రాల రమణయ్య)
దేవుడు తప్పి పోయాడు (విల్సన్ రావు కొమ్మవరపు)
కాంతి సందేశం, పద్యాలు (సిహెచ్. బృందావనరావు)
ఆలాపన, గజళ్ళు (ఎం.బి.డి. శ్యామల)
మట్టి రంగు బొమ్మలు (సిరికి స్వామి నాయుడు)
నల్ల చామంతి (చిత్తలూరి సత్యనారాయణ)
సవ్వడి గజళ్ళు ( భైరి ఇందిర)
మా ఇంటి దేవతలు బాల గేయాలు (బెలగాం భీమేశ్వరరావు)
మని షోక పద్యం (మెట్టా నాగేశ్వరరావు )
ఎదురు మతం (కరీముల్లా)
నీలి గోరింట (మందరపు హైమావతి)
మమతల హృదయాలు గజళ్ళ (కన్నెగంటి వెంకటయ్య)
భావనా తరంగాలు పద్యాలు (ఎరుకలపూడి గోపీనాథరావు)
కొత్త వేకువ (పద్మావతి రాంభక్త)
ఈ గాయాలకు ఏం పేరు పెడదాం టడాక్టర్ బీరం సుందర్రావు)
నీటి దీపం (తండా హరీష్ గౌడ్)
తెలంగాణ రుబాయిలు (ఏనుగు నరసింహారెడ్డి)
చౌరస్తాలో సముద్రం (సంగెవేని రవీంద్ర)
మట్టి పొరల్లోంచి (సోమేపల్లి వెంకటసుబ్బయ్య)
గాజు రెక్కల తూనీగ (సాంబమూర్తి లండ)
స్పెల్లింగ్ మిస్టేక్ (అనిల్ డ్యానీ)
అద్వంద్వం (శ్రీరామ్)
నది అంచున నడుస్తూ (చిల్లర భవానీ దేవి)
నేనొక పూలరెమ్మనై, పద్యాలు (ఉన్నం జ్యోతి వాసు)
మెలకువ చిగురించిన వేళ (ఉరిమళ్ళ సునంద)
తూర్పు తీరం (నల్లి ధర్మారావు)
ఒంటి రొమ్ము తల్లి (అమూల్య చందు)
దుర్గాపురం రోడ్డు (దేశరాజు)
సిరినవ్వు, బాల గేయాలు (కిలపర్తి దాలినాయుడు)
అరిసేతిలో బువ్వ పువ్వు (చింతా అప్పలనాయుడు)
ఎగురుతున్న పద్యం (అవ్వారు శ్రీధర్ బాబు)
కల్లంచు బువ్వ (ఈ రాఘవేంద్ర)
సమీకరణం (భూసురపల్లి వెంకటేశ్వర్లు)
మువ్వ, పద్యాలు (బులుసు వెంకటేశ్వర్లు)
చినుకు తాకిన నేల (శాంతి కృష్ణ)
మొలగొలుకు చేను (శివకుమార్ పేరిసెట్ల)
కలల రంగు (రహీమొద్దిన్)
నీటి గింజల పంట (కంచ రాన భుజంగరావు)
రాగుల సీమ (యాములపల్లి నరసి రెడ్డి)
పద్య ప్రభాతం, పద్యాలు (పాలపర్తి హవీలా)
కావ్య విపంచి ( డా. దేవర పల్లి ప్రభుదాస్)



-డా॥రావి రంగారావు
సాహిత్య పీఠం, గుంటూరు.
సెల్: 9247581825

## మంచి స్నేహం
కథ

సుందరవనం అనే అడవిలో ఒక జింక వేటగాని వలలో చిక్కుబడింది. దానికి చెట్టు మీద ఉన్న కాకికి చాలా స్నేహం . ఎక్కడికో ఆహారం కొరకు వెళ్లిన కాకి వచ్చి తన మిత్రురాలిని చూసి మిక్కిలి బాధపడింది . ఆ సమయంలో అక్కడ వేటగాడు లేదు. ఎక్కడికో వెళ్లాడు. ఆ కాకి జింకను కాపాడాలని నిశ్చయించుకొని ఆ వలత్రాళ్లను కొరకడానికి వెంటనే ఎలుక కొరకు బయలుదేరింది.

దానికి వేటగాడు ఆ జింకను పట్టుకోవడానికి ఆ వైపు వస్తూ కనిపించాడు. అది "అయ్యో !నా మిత్రురాలు ఆపదలో ఉంది. ఎలాగైనా దానిని కాపాడాలి. ఈ వేటగాడు కాస్తా ఆలస్యంగా ఆ జింక వద్దకు వెళితే బాగుండు "అని అనుకొని ఎలుక కన్నం వద్దకు చేరింది. కానీ ఆ సమయానికి ఎలుక తన నివాసంలో లేదు. అది ఆహారానికై ఎక్కడికో వెళ్ళింది . "అయ్యో! నా మిత్రురాలు ఇక వేటగానికి చిక్కక తప్పదు. మిత్రురాలుగా ఉండి నేను దానికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాను" అని దుఃఖించింది.

ఆ తర్వాత అది నిరాశతో తిరిగి వస్తున్న సమయంలో దానికి వేటగాడు జింకను తనతోపాటు తీసుకొని పోవడం కనిపించింది .

"అయ్యో ! మిత్రురాలా! ఎంత పని జరిగింది? సమయానికి ఎలుక ఉంటే నేను దాన్ని నాపైన ఎక్కించుకొని నిన్ను కాపాడుకునేదాన్ని కదా! నీలాంటి మిత్రురాలిని పోగొట్టుకున్న నేను ఎంతటి దురదృష్టవంతురాలనో కదా!''అని బాధపడింది. ఇలా బాధపడుతూ అది వేటగానివద్ద నున్న జింకను చూస్తూ చూస్తూ తన నివాసం వైపు వెళ్ళింది .

అక్కడ తన మిత్రురాలైన జింక కనిపించేసరికి అది ఆశ్చర్యపోయింది. అది ఎంతో ఆనందించింది. ఆ జింక " మిత్రమా ! నీవు ఎక్కడికి వెళ్లావు? నీ కోసం నేను ఎదురు చూస్తున్నాను" అని అంది. అప్పుడు కాకి" అయ్యో మిత్రమా ! నీవు వేటగానికి చిక్కావని అనుకుంటున్నాను. అతడు నిన్ను పట్టుకొని పోవడం నేను కళ్లారా చూశాను. నీవు ఎలా తప్పించుకున్నావు?" అని అడిగింది. అప్పుడు జింక "అయ్యో! మిత్రమా! నేను వేటగానికి చిక్కనే లేదు. అతడు ఈవైపుకు రానేలేదు. నీవు నాలాగే ఉన్న మరో జింకను చూసి అలా అనుకొని ఉంటావు. నీవు వెళ్ళిన తర్వాత ఒక కోతి ఇక్కడికి వచ్చి నన్ను చూసి ఈ వల నుండి నన్ను కాపాడింది. మనకు కొత్త మిత్రురాలు దొరికింది. అదిగో! ఆ కోతి ఇటే వస్తున్నది . నీకు దానిని పరిచయం చేస్తానుండు" అని అంది.

ఇంతలో ఆ కోతి అక్కడకు వచ్చింది . జింక దాన్ని కాకికి పరిచయం చేసింది. అప్పుడు కోతి "మీలాంటి మంచి మిత్రులు దొరకడం నా అదృష్టం" అని అంది . " లేదు.. లేదు....నీలాంటి మంచి మిత్రురాలు దొరకడం మా అదృష్టం "అని అన్నాయి కాకి,జింక.

ఆ మూడు చాలా రోజులు తమ స్నేహాన్ని కొనసాగించి ఆపదలో ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ఆనందంగా తమ జీవితాన్ని గడిపాయి.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535




## గజల్

గెలుపును పోకార్చుకోకు 'ఓటములెన్నైనా'
ప్రేమను చేజార్చుకోకు 'విఘ్నములెన్నైనా'

అగ్నిసెగలు దహియిస్తే భానుడు క్రుంగాడా?
తన తేజం వెదజల్లెను 'భగ్నములెన్నైనా'

ఒళ్ళంతా కుళ్ళబొడవ భూమి కలతనొందెనా?
రైతుకు తన బాసటిచ్చె 'గాయములెన్నైనా'

కణం కణం వ్రణంచేయ రాయి శిథిలపడలేదు
అందమైన శిల్పమయ్యె 'ఉలి ఘాతములెన్నైనా'

నీవూ ఆ దారి వెంటె చనుట ప్రమోదం శంకర్!
అడుగు అడుగు కలిపి నడువు 'అసూయలెన్నైనా'



-సూరారం శంకర్
సెల్:9948963141

## ఆస్తి !

మొకానికి చిరునవ్వతికించిన క్లిప్పుతో
గడప దాటితే నకిలీ నటన హెల్మెట్ తో
టన్నులకొద్ది కల్మషాన్ని మోసే స్వార్థంతో
వంకర్లు తిరిగి మాట్లాడే సంకరభాషతో
కపాలం భరించని కల్మశాన్ని నింపుకొని
ఆస్తిపాస్తులకై గుణంచెరచి , గతంమరిచి
అత్యాశలతో అస్తిత్వం కనుమరుగయ్యేలా
అనుబంధాలను చదరంగం చేస్తున్నారు
అంతరంగాలను రణరంగం చేస్తున్నారు
మమతల కోవెలను మాయం చేస్తున్నారు
జీవన బృందావనాన్ని ఎడారి చేస్తున్నారు
సుగుణమే సుందర చైతన్యదీప్తని మరిచినా
గతం నాస్తికాదు నేస్తం ,
అది జ్ఞాపకాల ఆస్తి !



- డా॥ డి. రాజేశ్
9440460490

# విశ్వశాంతిని కోరే విశ్వగీతం "ఎన్ ఇన్వ్యాల్యుబుల్ ఇన్వొకేషన్"




**– ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకం**
**– పుస్తకం వెల ఐదు కోట్లు**
**– ప్రపంచ శాంతి కోసమే రచన –డా. వంగీపురం శ్రీనాథాచారి**
**– ఘనంగా "ఎన్ ఇన్వ్యాల్యుబుల్ ఇన్వొకేషన్" పుస్తకావిష్కరణ సభ**

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయిత, లిమ్కా గిన్నిస్ వరల్డ్ రికార్డుల గ్రహీత, అనువాద రచయిత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి రచించిన " ఎన్ ఇన్వ్యాల్యుబుల్ ఇన్వొకేషన్ " పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11 న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వశాంతిని కోరి శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకం ప్రపంచ ప్రసిద్ధి పొందాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో ఉన్న అనేక సమస్యలను తన పుస్తకంలో ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయమన్నారు. ఇప్పటికే అనేక గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకం గిన్నిస్ రికార్డ్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ ఆకాశవాణి రీడర్ డాక్టర్ సమ్మెట నాగమల్లేశ్వరరావు పుస్తక సమీక్ష చేస్తూ ప్రపంచ సాహిత్య చరిత్రలో ఇప్పటివరకు ఇలాంటి గొప్ప పుస్తకం రాలేదన్నారు.

ఈ పుస్తకాన్ని పది విభాగాలుగా రచించారన్నారు. విశ్వశాంతిని కోరి రచించిన ఈ పుస్తకం ప్రపంచంలో పెద్ద పెద్ద రికార్డులు సాధిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ విద్యావేత్త కె. లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ పాలమూరు జిల్లాకు చెందిన వంగీపురం శ్రీనాథాచారి ప్రపంచస్థాయి పుస్తకాన్ని రచించడం జిల్లాకు గర్వకారణమన్నారు. అనేక అంతర్జాతీయ అవార్డులను పొందిన శ్రీనాథాచారి ప్రపంచశాంతిని కోరే దిశగా పుస్తకాన్ని రచించడం గొప్ప విషయమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల అనుభవంతో, మూడు సంవత్సరాల కఠోర దీక్షతో ఈ పుస్తకాన్ని రచించానన్నారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలను ఇందులో ఆవిష్కరించానన్నారు. ఏ దేశంలోనైనా సమస్యలన్నీ ఒకటేనని వాటిని పరిష్కరించబడాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని రచించానన్నారు. ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన సంబోధనాత్మక భావగీతంగా ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకమని, దీని వెల ఐదు కోట్లు అని అన్నారు.

ఈ పుస్తకాన్ని అమ్మగా వచ్చిన డబ్బులో మొత్తం ఐక్యరాజ్య సమితి వారికి యాభై శాతం, భారతదేశానికి ఇరవైఐదు శాతం , తెలంగాణ ప్రభుత్వానికి ఇరవైఐదు శాతం చెల్లిస్తానన్నారు. ఇందులో ప్రపంచంలోని 197 దేశాలలోని సమస్యలను 237 కవితలలో ఆవిష్కరించానన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకమిదని, త్వరలోనే అందరికీ అందుబాటులో తెస్తానన్నారు. కార్యక్రమ సమన్వయకులు, పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ వంగీపురం శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకానికి అనేక అంతర్జాతీయ అవార్డులు వస్తాయని, పాలమూరు కీర్తిపతాక ప్రపంచ స్థాయిలో రెపరెపలాడుతుందన్నారు. అనంతరం వంగీపురం శ్రీనాథాచారిని మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళ సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు రావూరి వనజ, రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్,

మాజీ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్. విజయకుమార్, సీనియర్ సిటిజన్ ఫోరమ్ అధ్యక్షులు జగపతిరావులతో పాటు జిల్లాలోని కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.




పేపర్ చూస్తే
కన్నీళ్లు దునుకుతయి
పేజీమేకప్ అంతా
నెత్తురు తోనే.



–అన్నవరం దేవేందర్
9440763479

# వారసులు కావలెను

కథ

1981లో రాసిన కథ



–అమ్మిన శ్రీనివాసరాజు
సెల్: 7729883223

"మారుతున్న కాలంతో పాటు మనమూ మారాలి ఆలోచనా విధానం పనితనం.. ఒక్క మానవతా విలువలు తప్ప!" ఒక్క సెమినార్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్న మాటలు అలవోకగా మళ్లీ నా ఆలోచనలై గిరగిరా తిరగడం మొదలెట్టాయి.

ఔను అన్నింటితో పాటు చదువుల్లో కూడా మార్పులొచ్చాయి వస్తున్నాయి. విద్యావిధానంలోనే పెనుమార్పులు తరుముకొస్తున్నాయి. మార్పు అవసరమే మారాలి కూడా. కాని.. అది మంచి కోసం మాత్రమే..!!

ఇలా ప్రతి చిన్న విషయం గురించి తదేకంగా ఆలోచించడం, మాట్లాడటం నాకు ఈ మధ్య మరీ ఎక్కువైంది. ఇది కొందరికి చిరాకు కలిగిస్తున్నా నాకు తప్పడం లేదు.

ఈ మధ్య నా ప్రవర్తనలోనూ ఏదో తేడా వచ్చింది. దాన్ని బైటవారు అంతగా అర్థం చేసుకోలేకపోయినా ఇంట్లో వారు మాత్రం ఇట్లే పసిగట్టేసి చివాట్ల దండకం మొదలెట్టారు కూడా..!

ఏది ఏమైనా రోజు రోజుకీ నాలో నాకు తెలియని అసంతృప్తి దినదిన ప్రవర్ధమానంగా పరిణతి చెందుతూనే ఉంది. నాలో వస్తున్న ఈ మార్పును ఒకరిద్దరు మిత్రులు కూడా అర్థం చేసుకుని అవాక్కయ్యారు కూడా!

ఎంత దాచుకుందామన్నా దాగని నిప్పులాంటి అసంతృప్తి జ్వాల నా గుండెల్లో మంటలు రేపుతుంది. ఆ అసంతృప్తికి తగ్గట్టుగానే నాకు ఎదురవుతున్న సంఘటనలు దాన్ని

> ప్రతి చిన్న విషయం గురించి తదేకంగా ఆలోచించడం, మాట్లాడటం నాకు ఈ మధ్య మరీ ఎక్కువైంది. ఇది కొందరికి చిరాకు కలిగిస్తున్నా నాకు తప్పడం లేదు.

మరికాస్త పెంచి పెద్ద చేస్తున్నాయి.

అబ్బాయి ఇంజనీర్ అంటే చాలు అమ్మాయిలు తల్లిదండ్రులు అవసరమైతే అప్పులైన చేసి లక్షలు కట్నాల రూపంలో ఇస్తున్నారు. నిజమే.. ఇంజనీరు పెళ్లి కొడుకుల జీతాలు అలాగే వుంటున్నాయి మరి!

నెలనెలా వేలకువేలు జీతాలు తీసుకునే అబ్బాయిలకూ ఒక్కసారి ఇచ్చే పెళ్లి కట్నం ఎన్ని లక్షలైనా తక్కువగానే కనిపిస్తుంది మరి.

ఆ రోజుల్లో బారిష్టర్ (లా) చదివితే ఎంత గొప్పో ఈ రోజుల్లో ఇంజనీరింగ్ చదవడం అంత స్టేటస్ అయిపోయింది.

ఈ రోజుల్లో పిల్లలు పదో తరగతికి వచ్చేటప్పటికీ తల్లిదండ్రులు మనో ఫలకాలపై తమ పిల్లలు ఇంజనీరై విమానాల్లో విహరించే దృశ్యాలు చక్కర్లు కొడుతున్నాయి. ఎంత ఖర్చైందన్నది కాదు ముఖ్యం ఇంజనీరింగ్‌లో సీటు వచ్చిందా లేదా అన్నదే ముఖ్యం!

"ఏమండీ.. కాఫీ..!" అన్న శ్రీమతి పిలుపుతో ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ కాఫీ త్రాగడం మొదలెట్టా.

సాంప్రదాయాలు జ్యోతిష్యం అంటే గౌరవించే కుటుంబంలోంచి వచ్చిన అభ్యుదయ భావాల హేతువాదిని కావడంతో నాన్నకు నాకు సదా అభిప్రాయ భేదాలే వచ్చేవి. అయినా నాన్నలోని మొండి పట్టుదల వాగ్ధాటితో నన్ను నా అభిప్రాయాలను ముందుకు పోనిచ్చే వాడు కాదు.

ఎప్పటిలాగే ఆ రోజు నాన్నకు నాకు వాదన మొదలైంది.

"నువ్వు ఎంత చెప్పు ఆ కేరళ జ్యోతిష్యుడు చెప్పినట్లు నీకుడి అరికాలులో ఆగీతలున్నాయి. అతను చెప్పినట్లు నువ్వు తప్పకుండా ఇంజనీర్‌వి అయ్యి తీరతావు" అన్నారు నాన్న.

నాన్న మొండివాదనకు నాకు నవ్వాగలేదు. "నాన్న నేను చదివిన చదువేంటి నువ్వు చెబుతున్న ఉద్యోగమేంటి దానికి దీనికి సంబంధమే లేదు" అన్నాను.

"నాకు తెలియదురా నా అంచనా బట్టి జ్యోతిష్య శాస్త్రం ప్రకారం నువ్వు ఇంజనీర్ కావాల్సిందే!" అన్నారు నాన్న తన సహజ ధోరణిలో..

నాన్నకు ఎలా చెప్పాలో తెలియక వాదించడం చేతకాక ఆ విషయం అంతటితో ఆపడానికి ప్రయత్నించి సఫలమయ్యాను.

ఆలోచనలు మాత్రం ఆగనంటున్నాయ్..!!

సాంప్రదాయాలకు కట్టుబడ్డ నాకు తెలుగు సాహిత్యం మీద మమకారం పెరిగి ఇష్టమైతే కష్టం కాదనే సూత్రంతో తెలుగులో మాష్టరు డిగ్రీ సంపాదించి కాలేజీలో తెలుగు పాఠాలు చెప్పుకుంటూ బ్రతుకుబండి నెట్టుకొస్తున్న నేను మారుతున్న కాలంతో పాటు ఎందుకు మారలేకపోయానా? అన్న ప్రశ్న పదే పదే నన్ను నిలవనీయడం లేదు.

ఎంతకాలం ఈ అల్ప సంపాదన అందమైన ఇల్లు చక్కని కారు. బోలెడు బ్యాంక్ బ్యాలెన్సులు.. వగైరా వగైరా.. ఈ జన్మకు సొంతం చేసుకోలేక పోతున్నాననే అసంతృప్తి నన్ను నిలువునా దహించి వేస్తుంది.

మళ్లీ జన్మంటు వుంటే మనిషిగానే పుడితే తప్పకుండా ఇంజనీర్ కావాలని ఇప్పుడే ఒక నిర్ణయం తీసేసుకున్నా అసంతృప్తిలో కుంగిపోతూ..

ఆ రోజు మా కాలేజీ రోజూ కన్నా కళకళ లాడుతోంది. ఓ పండుగ వాతావరణంలో ఉంది. పంచవన్నెల చిలకల్లా పిల్లలంతా తళుకులీనుతున్నారు. కళాశాల కళావేదిక అందంగా అలంకరించారు. సౌండ్ స్పీకర్స్ నుంచి శ్రావ్యమైన మధురమైన పాటలు పరవశింపజేస్తున్నాయి.

అప్పటిదాకా అసంతృప్తి లోకంలో తిరుగాడుతున్న నాకు వేదిక మీద సర్వేపల్లి వారి చిత్రపటం చూస్తేగాని గుర్తుకు రాలేదు. ఆ రోజు గురుపూజోత్సవమని, చక చకా ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. విద్యార్థి నాయకుడు నరేన్ ప్రధానాచార్యులతో పాటు అధ్యాపకులందరినీ పేరుపేరునా వేదికకు ఆహ్వానించాడు.

గురువులకు గురువైన సర్వేపల్లి గారి చిత్రపటాన్ని అందరిపక్షాన మా ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డిగారు

> ప్రతిరోజు వందలాది విద్యార్థులకు బోధించే బోధనా తృప్తి వేల రూపాయల నెల జీతపు సంపదకన్న మించిపోయింది.

పుష్పమాలాలంకృతం చేసి తన అధ్యక్ష ప్రసంగాన్ని ప్రారంభించారు.

ఆ ప్రాంతాన్నంతా నిశ్శబ్దం ఆవరించినా నేనూ ఈ లోకంలోనే వుండి గురువుగారి మాటలు శ్రద్ధగా ఆలకిస్తున్నాను.

విద్యార్థుల భావి జీవితాల గురించి ప్రణాళికల గురించి చెప్పడం మొదలెట్టారు ఆయన.

"నవ సమాజ నిర్మాణాన్ని నిర్మించే మీరంతా.." అని ఆయన అంటుంటే నాలో తిష్ట వేసుకున్న అసంతృప్తి వీరుడు ఒక్కసారిగా లేచాడు. "ఇంజనీర్లే అవ్వాలి" గట్టిగా అనేసా! నాకు తెలియకుండానే అలవోకగా..

ఈ అరుపుకి ప్రిన్సిపాల్ గారితో పాటు అక్కడి వారంతా అవాక్కై నన్ను అదోలా చూసారు. సభా సాంప్రదాయం ప్రకారం ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.." .. గొప్ప విద్యావేత్తలు కావాలి. సమాజమనే ఈ అద్భుతమైన సౌధాన్ని నిర్మించే అత్యంత గొప్ప ఇంజనీర్లు మరెవరో కాదు మీ భావి జీవితం.. ఉద్యోగాల గురించి ఈనాడే ఒక ఆలోచనకు రండి" అంటూ తన అధ్యక్షోపన్యాసం ముగించారాయన.

నాకు నాన్న మాటలు మళ్లీ గుర్తుకొచ్చాయ్ ఆయన అంచనాల్లో నిజం అప్పటికీగాని నాకు అంతుబట్టలేదు. అందుకే అన్నారేమో "పెద్దల మాట– చద్దిమూట" అని నిజమే అక్షర జ్ఞానం కన్నా అనుభవజ్ఞానం గొప్పదే ఆనాటి నుండి నా సంపద లెక్కలు మారిపోయాయ్.

ప్రతిరోజు వందలాది విద్యార్థులకు బోధించే బోధనా తృప్తి వేల రూపాయల నెల జీతపు సంపదకన్న మించిపోయింది. వివిధ ఉన్నత రంగాల్లో చేరుకున్న పూర్వ విద్యార్థుల అభిమాన ఆదరణలతో నాకో అందమైన భవనం బోలెడు బ్యాంక్ బ్యాలెన్సులుగా తయారయ్యాయి. కనిపించిన చోటల్లా విద్యార్థులు కురిపించే గౌరవ మర్యాదలతో కారును మించిన సౌకర్యపు సాధనంలో ప్రయాణిస్తున్నా.. అయినా నాలో మళ్లీ అసంతృప్తి.. నాకు వారసులు కావాలి.. నాలాంటి వారే..! సాఫ్ట్‌వేర్ ఎలక్ట్రానిక్స్ సివిల్ ఇంజనీర్లు కాదు "ఎడ్యుకేటెడ్ ఇంజనీర్లు" కావాలి.

*(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)*

నాటి తరం వారి కథలు నేటి తరానికి
**కథల వంతెన**

# అసలు మనిషి

కథ



1980లో రాసిన కథ



–డా॥నందిని సిధారెడ్డి
సెల్: 9440381148

"ఆ పూల్తో నువ్ మాట్లాడొద్దు," అంది మధు గంభీరంగా.

ఆడవాళ్లలో ఈ దరిద్రమైన గుణం ఎందుకుంటుందో నాకర్థం కాదు. ఏమంత చనువు లేకున్నా, ఇద్దరి మధ్య సాన్నిహిత్య మసలు లేకున్నా కాస్త ఎక్కువసేపు మాట్లాడితే చాలు, శాసించటం ప్రారంభిస్తారు. పెత్తనం ఫీలవుతారు. దాన్ని ప్రదర్శించుకోటానికి, ఋజూ చేసుకోటానికి అవకాశాల కోసం దేబెమొహాలు పెట్టుకుని చూస్తారు. నాకదే నచ్చదసలు.

"ఎవర్తో?" అడిగాను చిరునవ్వు చిలకరిస్తూ.

"అదిగో మెట్లమీంచి వొస్తున్నాడే, అతను.. అతన్తో." అంది కొంగుతో వేలిని చుడుతూ, వేలితో అతన్ని చూపెడుతూ, అటుకేసి చూశాను, 'కిరణ్', నాకాశ్చర్యం వేసింది. అతనుత్త అమాయకుడు.

"అతనంటే నాకు జాలి," అన్నాన్నేను. మధు మొహంలోకి చూస్తూ.

పెద్దగా నవ్వి, "ఎన్ని లీటర్లో," అంది విద్య.

ఆ మాటకి విద్యావతి నవ్వటం బొత్తిగా నచ్చలేదు నాకు. పైగా కిరణ్ దగ్గరగా వొచ్చాడు కూడా. బాగుండదని నేను చూడనట్టు తల తిప్పుకున్నా.

'నమస్తేనే అన్నా," జోడించిన రెండు చేతులూ, చేతుల్లో ఫైలు రెండు నిమిషాలు దాకా దించనేలేదు. 'అక్కడున్న అమ్మాయిలందరికీ ఒక్కొక్కరికి పెడితే అంతసేపు పట్టదా,' అన్నట్లుందతని చూపు. ఏం మాట్లాడా లనిపించలేదు. కానీ, మధుని ఏడిపించటానికన్నా మాట్లాడాలనిపించింది.

"ఎటూ?" అడిగా.

"డిపార్ట్‌మెంట్‌కే."

"క్లాసుందా?"

"లే, ప్రొఫెసర్‌గారికి కొంచెం మస్కా యేద్దామనీ..."

"సరే,' అని మధు వాళ్లవైపు తిరిగాను.

ఫైలు పైకెత్తుకుంటూ కిరణ్ వెళ్లిపోయాడు.

వచ్చీపొయ్యే వాళ్లమీద కామెంట్స్ చేసుకుంటూ నవ్వటానికీ, సాహిత్యానికీ, సినిమాలకీ సంబంధించి పిచ్చాపాటీ మాట్లాడుకోటానికీ కారిడార్ సర్వదా అనుకూలం కాబట్టి చచ్చినట్టు అక్కడ చేర్తాం మేం.

"చూడు, ఆ రాస్కెల్ ఎలా చూస్తాడో– వాడితో మాట్లాడితే నీతో యింక మేమెవరమూ మాట్లాడం."

నాక్కోపం వచ్చింది. "మీరే లేందే నేను బతకలేను.. నా జీవిత సర్వస్వమూ మీరే,' అని సిన్మాహీరోలా నేనేం అన్లేదే? ఎందుకంత బెదిరింపు? భరించలేకపోయా.

"మాట్లాడకండి, నాకు పోయేదేముంది?" గుండె కంటే నోరే ముందడుగేసింది.

"అంత గొప్పవాడా?" అంది మధు ఎగతాళిగా.

"అంత దుర్మార్గుడా?" అన్నాన్నేను.

"దుర్మార్గుడు నయం! వాడికో రకం నీతుంటుంది. ఈ బ్లడీ బాస్టర్డు దేనికీ చెందదు. దూరంగా కూచుండి కుక్కలా దొంగచూపులూ– వాడూ, ఎంత అహస్యంగా వుంటుందీ? ఆడపిల్లల వెనక వాళ్ల నడకల్ని ఎగతాళి చేస్తూ నడవటం– ఇండ్లదాకా మా వెంట

> "మీరే లేందే నేను బతకలేను.. నా జీవిత సర్వస్వ మూ మీరే,' అని సిన్మాహీరోలా నేనేం అన్లేదే? ఎందుకంత బెదిరింపు?

కాపలా రావటం– అలా అఘోరించకపోతే ఈ విశాల విశ్వ విద్యాలయంలో ఎందరితోనో మాటాడ్తాం కదా, వాణ్ణి వచ్చి మాట్లాడమన్నాం. ఆ ధైర్యమూ లేదు. బ్లడీ డాగ్. వాన్తో నువ్వెట్లా మాట్లాడగల్గుతున్నావో బాబూ.. ఛ.."

నాకవేవీ నమ్మబుద్ధి కాలేదు. కిరణ్‌కి అంత ధైర్యమున్నదని నేనెప్పుడూ అనుకోను.

"ఏమో, నేన్నమ్మలేను," ఇంకా ఉడికిద్దామని అన్నాను.

మధుకి ఆవేశం వచ్చినట్లుగా నా చెయ్యి పట్టుకుని లాక్కెళ్తోంది, 'నువ్వే చూస్తావు రా,"

ఆడవాళ్ల చెయ్యి తగిల్తేనే మెత్తగా, మత్తుగా వుంటుందనుకునే నేను, మధు చెయ్యి పట్టుకుని లాక్కెళుతున్నా ఏమనిపించకపోవటం మరీ వింతగా అనిపించింది. మా క్లాసురూం దాకా లాక్కెళ్లి, విద్య వాళ్ల బెంచి మీద కేసి నా తల వొంచి, "చూడు", అంది. కిరణ్ గాడి రాతే. వాడి అక్షరాలే. పొద్దున ఫిలాసఫీ వాళ్ల క్లాసులు, సాయంత్రం మా క్లాసులు ఆ రూంలోనే జరుగుతాయి. అటు తిరిగి మెల్లగా చదివాను. 'చెలీ రాత్రికి వొస్తావా?' నెత్తి గోక్కున్నాను. మళ్లా లాక్కెళ్లి యింకో బెంచీ చూపింది. 'డార్లింగ్, ఐ వాంట్ టూ స్లీప్ విత్ యూ–కె,' 'సుజీ! నీ వక్షసంపద అంటే పడి చస్తా.' నేను కళ్లు మూసుకోలేదు కానీ నోరు మూసుకోక తప్పలేదు.

××

రాజకీయాల్లో, సాహిత్యమో.. తాగుడో, పేకాటో యింకా యిలాంటి వేవో కొత్త స్నేహితుల్ని కొట్టుకొస్తాయని తెలుసు కానీ, వింత పరిచయం వుంటుందనుకోలేదు.

ఎప్పుడో ఓసారి పంక్తిలో కూచుంటే, 'లాస్ట్‌వన్'గా లేచి అందరి ఎగతాళికి గురయే నేను హాస్టల్‌లో అడుగుపెట్టడంతో రోజూ గొప్ప ఇబ్బందయేది. 'మెస్'లో నాదే చివరై హేళన పాలవుతానని బాధపడ్తున్నా రెండో రోజున ఒక వ్యక్తి నా దృష్టిలో కొచ్చాడు. నేను మెస్‌కెళ్లేటప్పటికే తింటున్నాడతను. టేబుల్ క్లీన్ చేశాక నేను వెళ్లి కూచుని, తిని లేచాను. ఇంకో ఫ్రెండ్ కలిస్తే మెస్ ముందే నిలబడి పది నిమిషాలు గడిపేం! వెళ్తూ మెస్‌లోకి చూస్తే అతని భోజనం పూర్తికాలేదు. ఆలోచిస్తూనే ఉన్నాడు నోట్లో ముద్దతో. వర్కర్స్ నాకేసి చూసి నన్నగా నవ్వాడు. అది అతని గురించేనని తెలుసుకోటం ఏమంత కష్టం కాలేదు. ఓరోజు అనుకోకుండా అతని పక్క సీట్లోనే కూచుండి తినాల్సి వొచ్చింది నాకు. పలకరించాడతనే.

"ఏ డిపార్ట్‌మెంట్?"

"తెలుగు."

"నాది ఫిలాసఫీ," అన్నాడతను. నేను తెలుగు అనటంతో అతను కళ్లు మిటకరించాడు. తృప్తి ఫీలయాడు. సంభాషణని మెల్లగా భగవద్గీతలోకి లాగాడు. తెలుగు వాళ్లంటే భగవద్గీత, భారతం, ప్రబంధాలూ తప్ప ఇతర విషయాలు ఏవీ తెలవవనీ తెలవొద్దనీ ఎందుకనుకుంటారో నాకర్థం కాదు. ఆత్మ పరమాత్మల గురించే మాట్లాడాడు తిన్నంతసేపు. నేను కట్‌చేసి లేవబోతే కంపెనీ ఇవ్వమంటాడు. పోనీ అని కూచుంటే ఆత్మనీ, పరమాత్మనీ కలిసి నా మెడకు గంటలా కట్టటానికి విఫలయత్నం చేస్తాడు.

ఆ తర్వాత మేమెప్పుడు కల్సుకున్నా మెస్‌లోనే. మెస్ పుణ్యమాని మాస్నేహం మూడు పువ్వులూ ఆరు కాయలు కావటానికి పరుగులు తీసింది. ఓరోజు గాంధీగారి 'చెంప' సిద్ధాంతం వమనం చేశాడు. అరవింద కన్ను ఫిలాసఫీ దగ్గర్నుంచి ఎన్టీ రామారావు సినిమాల దాకా పొగట్టం– రష్యా, చైనాల మీద కావాలని దుమ్ము చల్లటం నాకు నచ్చేది కాదు. తగూపడేవాణ్ణి. అయినా, ఆయనంటే నాకు విపరీతమైన జాలి, కొన్ని విషయాలు తెలుసనే గౌరవమూ ఉన్నాయి. కాని, ఎందుకో హాస్టల్‌లో ఆయన్తో ఎవరూ మాట్లాడరు. మహా అయితే ఒక్క వెంకట్రావ్ తప్ప, కాలేజీలో కూడా అంతంతగానే ఎప్పుడూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తు న్నట్టు పరధ్యానంగా ఉంటాడు కాబట్టి ఆయన్ని 'ఫిలాసఫర్' అనీ, 'అంబర చుంబి' అనీ ఎగతాళి చేస్తుంటారు చాలా మంది.

ఈ రోజు మధు, విద్యల మాటలు విన్నాక కిరణ్ అంతరంగం తెలుసుకోవాలనిపించింది. మాట్లాడితే భగవంతుడో, మోక్షమో, స్వర్గమో జపించే అతన్లో ఇంత విపరీతం ఉందని అంచనా వేయలేకపోవటం అవమానంగానే వుంది నాకు. గత స్మృతుల్ని గట్టిగా తిరగేశాడు.

×××

ఆనాటి డిన్నరయాక చెట్లకింద కూచున్నా నేనొక్కణ్నే. చిన్నగా చీకటి పడింది. నేల మీద ఏదో గీస్తూ చెట్ల గుసగుసలు వింటున్నా.

"అన్నా, ఒక్కడివే కూసున్ననేమే.." అంటూ కిరణ్ వొచ్చాడు.

"నీ కథ ఏదో పత్రికలో చదివానే. భలే గొప్పగుంది." నేనేం మాట్లాడలేకపోయా.

"యాడ జూసినవే. మనుషుల్ని గొప్పగ స్టడీ చేసి రాస్తావ్ నువ్."

మళ్లీ మౌనమే నేనయ్యా.

"ఎంతైనా మీ రాసేటోళ్లంతా గొప్పోళ్ళనే."

"ఎవరన్నరట్లా," అన్నాను మరీ మాట్లాడకపోతే బాగుండదనీ.

"అనకే. లేకపోతే నీ సుట్టు ఎప్పట్కి. అంతమంది ఆడోళ్లెందుకుంటారే."

"నోరు మంచిదైతే, అంతా.." నా మాట పూర్తికాకముందే ఆపాడు.

"అనకే– మా అసోంటోళ్లను ఎవలు కాన్తలేరే?"

ఆనాడు నాకు కిరణ్ అంటే జాలి వేసింది. అది అమాయకత్వం కిందే జమేసుకున్నా.

మెస్‌లో సీట్లు ఫుల్ అయిపోయాయి. కొందరు మెసు ముందే అడ్వాన్సుగా నిలబడి విద్యార్థి రాజకీయాలు మాట్లాడుతున్నారు. నేను కాసేపయాక మళ్లీ వొద్దామని రూంకి వెళుతుంటే కిరణ్ పట్టుకున్నాడు.

"అన్నా– ఒక చిన్న సందేహమే.." సాగదీశాడు చెప్పమన్నాను.

వినీల కచభర విలాస బంధుర తనూలతిక చంచలించిపోగా, అంటే ఏమన్నట్లె," అన్నాడు చెప్పాన్నేను. "అంత గొప్ప అర్థమున్నదాయె," అని నా నడుం పట్టుకుని ఊపాడు. నా కడుపులో తలపెట్టి, " అన్నయ్యా బాగ చెప్పినవే," అని ఉక్కిరిబిక్కిరి చేశాడు. మళ్లీ 'వినీల కచరభర విలాస బంధుర," అన్నాడు. "అయితే ఇదెవలు రాసిండ్రే?" పేరు చెప్పాన్నేను. "అంటే మీ డిపార్ట్‌మెంట్ అతనానే?" నోరు తెరిచాడు.

"ఆఁ"

"అచ్చా, మీ కవి ఆడోళ్లకు బాగా లైటు కొడ్తాడట గాదె."

"ఛ– అదొట్టి గాసిప్."

"అమ్మో.. చెప్పకు. లైటుగొట్టంది గింత మంచిగెట్ల రాస్తడుగని– వినీల కచభర విలాస.." గొణుక్కుంటూ వెళ్లిపోయాడు.

ఆనాడూ కిరణ్‌లో అమాయకత్వమే కనిపించింది.

××

అన్నయ్యా, ఆ అమ్మాయితోని తిరుగుతాడు, అతనెవరే?"

"ఏ అమ్మాయే?" ప్రశ్న నాదైంది.

"అదే.. నిన్న ఎర్రచీర కట్టుకొచ్చింది చూడు."

"ఏమో.. చీరా గీరా నేను గమనించలేదు మరి."

"శనివారం చుక్కల బ్లౌజు వేసుకొచ్చింది, గుర్తుందా?"

"ఇవన్నీ నీకెట్లా గుర్తున్నయె..అదే పనా? చీరలు చూడటం."

"ఆమేనే– ఆమె పేరు విద్య."

నాకాశ్చర్యం వేసింది. అంతసేపు పేరు తెలుసుండి ఎందుకు దాచుకున్నట్టు? చీరలు చెప్పడానికి వెనకాడకుండా పేరు చెప్పడానికే ఎందుకు వెనకాడినట్టు?

"అదే ఆ విద్యతోని తిరిగే అతనెవరు?'

"మా క్లాస్‌మేటేనే."

"మరి అతన్తోనెందుకు తిరుగుతది."

"తిరిగితే నీకేమయిందే. వాళ్లిష్టం. పెండ్లి చేసుకొంటరేమో."

ఒక్కసారి భయపడ్డట్టు, ఏదో జరక్కూడనిది జరిగినట్టు, వినకూడనిది విన్నట్టు మొహం పెట్టాడు.

"వస్తనే పనుంది."

అప్పుడు కిరణ్‌లోని పిల్లాడి మనస్తత్వాన్ని పెదవుల మీద చప్పరించాను.

××

మళ్లీ గడియారం చూసుకొన్నా. ఒకటి దాటింది.

క్లాసుకి ఆలస్యమయిందని పరిగెత్తుతున్నట్టు నడుస్తున్నాను. చప్పట్లు వినిపించాయి. అటు చూశాను.

కిరణ్, చెట్టుకింద ఒక్కడే కూచున్నాడు.

'ఎండవేళ ఏం చేస్తున్నాడబ్బా." అనుకున్నా. గోల వినిపించింది. ఇద్దరు వయసు బుసబుస పొంగే అమ్మాయిలు బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. సైగచేసి వెళ్లిపోయా. సాయంత్రం ఐదింటికి తిరిగి వొచ్చేటప్పుడు కూడా కిరణ్ అక్కడే ఉన్నాడు. ఒక్క అమ్మాయే గ్రౌండ్‌లో ఉంది.

మధు మాటలు తళుక్కుమన్నాయి.

××

ఫ్రెండ్‌ని పిలుచుకుని టీ కెళ్దామని పై కెళ్తున్నా.. నన్ను దాటేసి మాట్లాడకుండానే కిరణ్ జెట్‌స్పీడ్‌లో వెళ్లాడు. ఎప్పుడూ తనే పిలిచి మాట్లాడేవాడు ఈరోజు పట్టించుకోకుండా వెళ్లేసరికి వండర్ అనిపించింది. కిరణ్‌ని ఫాలో అయాను. బాత్రూమ్‌లో కెళ్లాడు. వెంటిలేటర్స్‌లోంచి బయటికి తీక్షణంగా చూస్తున్నాడు. "ఏంటీ కథా." అని ఆరాతీస్తే తెలిసింది.

ఎదురుగా స్విమ్మింగ్ పూల్‌లో అమ్మాయిలు ఈత నేరుస్తున్నారనీ! ఆ రోజు స్విమ్మింగ్‌పూల్‌కి 'వుమెన్స్ డే' అనీ! నాకు కిరణ్‌ని చూస్తే నవ్వొచ్చింది. కావాలని వెంకట్రావు నెపం పెట్టుకుని కిరణ్ రూం కెళ్లాను.

తలుపు కొట్టా, కాసేపాగి తీశాడు.

నన్ను చూడటంతోనే పొంగిపోయినట్టు మొఖం పెట్టాడు. నాలుకని ఫ్రీగా వదిలిపెట్టాడు. "రాయే.. రా రా, మా రూం పావనం జెయ్యి," అంటూ కుర్చీ చూపించాడు. కూచున్నా.

కిరణ్‌ని మాట్లాడిస్తోనే రూం కలియచూశా. పుస్తకాలు చక్కగా అమర్చబడి వున్నాయ్. బెడ్ పక్కనే ఓ విచిత్రమైన కాంబినేషన్.

భగవద్గీతను బోధిస్తున్న కృష్ణుడు– కురుక్షేత్రం వగైరా వున్న కాలెండరూ– పక్కనే 'జీనత్ అమన్' అర్ధనగ్నంగా వున్న కాలెండరూ.

మరోసారి ఆశ్చర్యం వేసింది. రావిశాస్త్రి గుర్తొచ్చాడు.

"ఆ కృష్ణుని ఫోటో ఎందుకోయ్ అక్కడ పానకంలో పుడకలాగా. తీసెయ్." అన్నాను.

"అదే నాకిష్టం. కొంత ఆధ్యాత్మికత, కొంత సౌందర్యోపాసన," అన్నాడు, తను గొప్ప ఫిలాసఫర్‌గా ఫోజు పెడుతూ–సన్నగా నవ్వు విసుర్తూ.

"కృష్ణుని చిత్రం చింపేస్తా," అన్నాను.

"జీనత్ అమన్‌ది చింపేస్తానని నిన్న ఒకతను కొంచెం చింపాడు కూడా.." అని చూపించాడా పక్క.

"ఏదో ఒకటి తీసెయి, " కిరణ్ గురుత్వాకర్షణ శక్తి తేల్చుకుందామని.

"నో– వీల్లేదు. అక్కడ చూస్తే అవుటయిపోతావ్." అని "తలుపు వేసి చూడు," చెప్పాడు. వేశాను.

తలుపుకి వెనకపక్క–

నన్ను నేను నమ్మలేకపోయా...

> కాగితాలన్నీ కుప్పగా పోశాడు. అగ్గిపుల్ల గీసి ఒక్కో కాగితానికి అంటించి కింది నుంచి చూసే జనం మీది కి విసుర్తున్నాడు.

అన్నీ నగ్నచిత్రాలే– అంగాల్ని చేతుల్తో దాచుకుంటున్నట్టు– కళ్ళతో కసిగా రమ్మని పిలుస్తున్నట్టు– కొంచెచిత్రాలు చాలా వున్నాయి.

అవన్నీ వుండటం ఆశ్చర్యమే కానీ, కిరణ్‌పైకి కనబడే రూపం, లోన కనబడే రూపం భిన్నంగా వుండటమే తప్పనిపించింది. ఆయనకు భౌతికం భగవద్గీతా– ఆత్మికం అమ్మాయా? ఆ ముసుగే తప్పనిపించింది. చాలాసేపు అదే వాదం చా. ఆయన్లో వుండే వీక్‌నెస్ చెప్పా.

ఆయన గురించి అమ్మాయిలేమనుకుంటున్నదీ చెప్పా. ధైర్యముంటే వెళ్లి పలకరించి స్నేహం చేసుకోమన్నా. ఆడవాళ్ల దృష్టిలో చులకనెందుకవుతావని అడిగా.. కిరణ్ మాట్లాడలేక కొట్టడానికొచ్చాడు నా మీదికి.

××

మా ఫ్రెండ్ వచ్చి నా గది తలుపులు బాదాడు.

ఐదవుతుంది. లైబ్రరీ నుంచొచ్చి చిన్న కునుకేశా. వెంటనే తలుపు దబదబ. లేచా తలుపు తీసి తీయటంతోనే చెప్పాడు.

"కిరణ్ పిచ్చి పిచ్చిగా అరుస్తున్నాడు. కిందపడి కొట్టుకుంటున్నాడు." అని వెళ్లి చూశాం.

గదిలో కాలెండర్లు లేవ్. బొమ్మల్లేవ్– పుస్తకాల్లేవ్.

రూంనిండా బయటా కాగితపు ముక్కలే.

కృష్ణుడు మొహం పగిల్నట్టు చిన్న భాగం మిగిలింది.

అంగాలన్నీ కోసేసినట్టు బొమ్మల సుందరాంగులు ముక్కలు ముక్కలై– నన్ను చూస్తూనే 'రాడ్' పట్టుకుని లేచాడు. నేను పరిగెత్తా. అందరూ దూరంగా నిలుచుని చూస్తున్నారు. విలువైన పుస్తకాలన్నీ చింపుతున్నాడు. పళ్లకింద పెట్టి కొరుకుతున్నాడు. ఒళ్లంతా చెమట కక్కుతోంది. కాగితాలన్నీ కుప్పగా పోశాడు. అగ్గిపుల్ల గీసి ఒక్కో కాగితానికి అంటించి కింది నుంచి చూసే జనం మీది కి విసుర్తున్నాడు. కొందరు భయ పడి అటూ ఇటూ పరిగెత్తుతున్నారు. హెల్తు సెంటర్ డాక్టర్‌ని తీసుకుని వార్డెనూ, చీఫ్ వార్డెనూ వచ్చారు. వాళ్ల మీదికి కాలే కాగితాలొదలటం, రాడ్ తిప్పటం చేస్తున్నాడు.

"మెంటల్ కేస్," అన్నాడు డాక్టర్. ఆకస్మాత్తుగా ఎందుకలా అయిపోయాడో నాకు తోచలేదు.

××

మీ కిరణ్‌ని శాండిల్స్‌తో సన్మానించాం," అంది మధు.

కోఠీ బస్‌స్టాప్‌లో బస్ కోసం చూస్తోంది.

"పాపం ఎందుకు?" అన్నా. ఆమె అదోరకంగా నవ్వింది.

"ఎప్పుడూ?"

"ఇందాకే ఓ గంట క్రితం."

"ఏం పాపం చేశాడనో ఇంతన్యాయం చేసేరు," అన్నా చిన్నగా నవ్వుతూ..

"ఇందాక విద్య, నేను, వాణి క్యాంటీనను నుంచి వచ్చి, బస్ కోసం చెట్ల కింద కూచున్నాం. మా దగ్గరికి బల్లిలా ఊడిపడ్డాడు ధన్‌మని. "నేనంటే చులకన భావముందా మీకు..." అని పీడించాడు. మేం ముభావంగా ఉన్నాం. చెప్పమని ఒకటే గోల. 'లేక పోతే గొప్ప ఆరాధనా భావమా? నాన్సెన్స్ సిగ్గులేకపోతే సరి..' అంది విద్య. "ఏందే నాన్సెన్సంటావా నన్ను ..నన్ను.. నాన్సెన్స్.. ఇంత చుల కనా?" అంటూ. అమాంతం బూతు లు చదువుతూ మీది మీదికొచ్చాడు. అంతే భరించలేక విద్య శాండల్స్ తీసింది. తప్పనిసరై వేసేసింది."

"పొద్దున్న నన్నూ కొట్టబోయాడు." అన్నాన్నేను. "నిజంగా!" చిత్రంగా చూసింది మధు. ఆమెకు బస్సొచ్చింది.

**గవ్వ**

ప్రమాణం రాజ్యాంగం మేరకు
పాలన వాస్తు ప్రకారం
ప్రజల సొమ్ము.. 'కట్టడాల పాలు'

–జిందం అశోక్,
సెల్: 8978532225

### త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో

# డా॥కె.వి.రమణాచారి జన్మదిన వేడుకలు

డా॥కందిమళ్ల సాంబశివరావు చెప్పినట్టు మధురమనస్వి.. విపుల యశస్వి, అమలవచస్వి.. నాటక తపస్వి.. డా॥కె.వి. రమణాచారి.

ఆయన వ్యష్టి కాదు, సమిష్టి వ్యక్తి కాదు, ఒక వ్యవస్థ. ఆయన్ని దర్శించే నిత్య సందర్శకులను పరికిస్తే అన్ని రంగాల వారూ కనిపిస్తారు. అందర్నీ ఆప్యాయంగా పలకరించే డా॥కె.వి.రమణాచారి జన్మదిన వేడుకలు పలు సంస్థలు నిర్వహించడం ఆనందదాయకం. ఈనెల 5 నుండి 9 వరకు త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో పలు వేదికలపై జరిగిన డా॥కె.వి.రమణాచారి జన్మదిన వేడుకలు.

## ప్రోత్సాహంతో ప్రతిభ వెలుగులోకి వస్తుంది

### –హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనా రెడ్డి



నాట్యగురువు తులసిని సత్కరిస్తున్న జస్టిస్ శేష శయనారెడ్డి, గుదిబండి వెంకటరెడ్డి, కళా జనార్ధనమూర్తి

ప్రతివారిలోనూ ఏదో ప్రతిభ ఉంటుందని దానిని వెలుగులోకి తెచ్చేందుకు ప్రోత్సాహం ఇచ్చేవారు కావాలని హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ శేష శయనారెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని లలిత కళా వేదికపై గానసభ నిర్వహణలో ఈనెల 5న సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్॥కె.వి. రమణాచారి జన్మదిన వేడుకలు ఆరంభమైనాయి. ముఖ్య అతిథిగా జస్టిస్ శేష శయన రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రమణ జన్మదినం పండుగలా వివిధ సంస్థలు నిర్వహిస్తున్నారని ఇది ఆయన కళాకారుల పట్ల ప్రేమకు కారణం అన్నారు. కారు నడిపేందుకు ఇంధనం అవసరమైనట్టే పిల్లలలో వున్న ఆసక్తి గమనించి ప్రోత్సహించడం ముఖ్యమని అది తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ ఎందరికో సహాయ పడిన రమణాచారి పదవీ విరమణ అనంతరం కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. కళాపోషకుడు గుదిబండి వెంకటరెడ్డి, నాట్య గురువు తులసి పాల్గొన్నారు. సభ అనంతరం తులసి శిష్య బృందం శాస్త్రీయ నృత్యాలు చేశారు.

## బ్రహ్మంగారి కాలజ్ఞానం బుర్ర కథ



బుర్రకథకుడు సాలం కృష్ణయ్యను సత్కరిస్తున్న హౌజింగ్ కార్పోరేషన్ పూర్వ చైర్మన్ కె. దామోదర్, కళా జనార్ధనమూర్తి తదితరులు.

సమాజంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పిన కాలజ్ఞానం ప్రాచుర్యంలో ఉంది ఆయన కాలజ్ఞానంను బుర్ర కథ రూపంలో సాలం కృష్ణయ్య బృందం ఆసక్తికరంగా చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత వేదికపై ఈనెల 6న సివిల్ సర్వీస్ విశ్రాంత అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి జన్మదిన సందర్భంలో త్యాగరాయ గానసభ నిర్వహణలో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా సూర్యాపేటకు చెందిన శాలం కృష్ణయ్య బృందం బుర్రకథ గానం చేశారు. అనంతరం జరిగిన సభ కార్యక్రమంగలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటి దామోదర్ ఉద్యోగ సంఘాల పూర్వనేత గుండవరపు దేవీ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ తెలుగు నేలకు సుపరిచితులైన రమణాచారి సాహిత్యానికి కళలకి చేస్తున్న సేవ అపారం అన్నారు. ఆయన జన్మదిన సందర్భంలో మరుగున పడుతున్న హరికథ బుర్రకథలను పరిరక్షణకు సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రజలతో పాటు ప్రభుత్వాలు కూడా ఇట్టి కళలను పోషించాలని కోరారు, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ బుర్రకథ కళా కారులు సహకరిస్తే వారం రోజుల పాటు కార్యక్రమం జరుపుతామని తెలిపారు. సభలో రాష్ట్ర బుర్రకథ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీ. శంకర్, కళాభిమాని వైకుంఠం పాల్గొన్నారు.

## కళలు సాహిత్యానికి సాంస్కృతిక సంస్థలు ఆలంబనలు-ఆచార్య కొలకలూరి ఇనాక్



రఘుశ్రీ రచన హిందీ అనువాద సంపుటిని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, కళా జనార్తనమూర్తి తదితరులు

కళలు సాహిత్యానికి సాంస్కృతిక సంస్థలు ఆలంబనలు అనీ అట్టి సంస్థలలో త్యాగరాయ గానసభ చేస్తున్న సేవలు విశేషమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందించారు. శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో గానసభలోని లలిత కళావేదికపై ఈనెల 7న సివిల్ సర్వీస్ విశ్రాంత అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి జన్మదిన సందర్భంలో జరుగుతున్న నృత్య సాహిత్య సంగీత ఇతర కళా ప్రక్రియలలో భాగంగా బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో రఘుశ్రీ రచించిన కవీంద్ర మోక్షకు నిర్మల చేసిన హిందీ అనువాద సంపుటి ఆవిష్కరణ కవి సమ్మేళనం జరిగింది.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. మూల కవితలు భావం మారకుండా హిందీ లోకి నిర్మల యధాతథంగా అనువదించి న్యాయం చేశారన్నారు. రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని గానసభ బుర్రకథవంటి కళాకారులను ప్రోత్సహించడం ప్రశంసనయమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సినీ దర్శకుడు లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, కవి కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో రఘుశ్రీ నిర్వహించగా వెంకటస్వామి, కనకాచారి, బాల గంగాధరయ్య, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు స్వీయ కవితలు చదివారు.

## సత్య హరిశ్చంద్ర నాటకం రసభరితం



డా॥ శలపాణిని సత్కరిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్, కళా జనార్ధనమూర్తి, బండి శ్రీనివాస్, త్రినాథరావు.

బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్య హరిశ్చంద్ర నాటకం డాక్టర్ శూలపాణి నిర్వహణలో రస రమ్యంగా ప్రదర్శించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని లలిత కళావేదికపై ఈనెల 8న గానసభ నిర్వహణలో విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి డాక్టర్ కె.వి. రమణ జన్మదిన సందర్భంగా జరుగుతున్న కళా సప్తాహమ్‌లో భాగంగా సత్య హరిశ్చంద్ర నాటకంలోని ఘట్టాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్ పాల్గొని కళాకారులను అభినందించారు. గాయకుడు త్రినాథరావు, గానసభ పాలక మండలి సభ్యులు బండి శ్రీనివాస్ ద్రావిడలు పాల్గొనగా, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించారు

## సంయుక్త బృందం శాస్త్రీయ గాన గోష్ఠి శ్రావ్యం



ప్రముఖ శాస్త్రీయ సంగీత గురువు సంయుక్తను సత్కరిస్తున్న బైస దేవదాసు, కళా జనార్ధనమూర్తి.

ప్రముఖ శాస్త్రీయ సంగీత గురువు గానసభ సంగీత కళాశాల అధ్యాపకురాలు సంయుక్త తమ శిష్య బృందంతో కలసి అన్నమయ్య రామదాసు కీర్తనలు శ్రావ్యంగా గానం చేశారు. శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో ఈనెల 9న సివిల్ సర్వీస్ విశ్రాంత అధికారి డాక్టర్. కె.వి.రమణాచారి జన్మదిన సందర్భంలో నిర్వహిస్తున్న కళా సప్తహాంలో భాగంగా లలిత కళావేదికపై సంయుక్త బృంద గాన గోష్ఠి ఆకట్టుకుంది.

అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నేటినిజం సంపాదకుడు బైస దేవదాసు మాట్లాడుతూ సంగీతం మనసుకి విశ్రాంతి ఇస్తుందని అన్నారు. ధనం సంపాదించిన ఎందరో అధికారులు చాలా మంది ఉన్నారని ప్రజల హృదయంలో స్థానం సంపాదించిన వారిలో రమణాచారి ముఖ్యులనీ కొనియాడారు.

దేశంలో ఎక్కడా ఒక అధికారి పదవీ విరమణ చేసిన తరువాత కూడా రోజుల తరబడి ఆయన జన్మదిన వేడుకలు జరపటం వినలేదనీ అది ఒక్క రమణాచారి విషయంలో మాత్రమే అన్నారు. ఆయన అధికారంలో వున్నా లేకున్నా ప్రతి సంవత్సరం ఆయా సంస్థలు జన్మదిన వేడుకలు జరుపుతు పలువురు కళాకారులను సత్కరించడం కూడా ఓ ప్రత్యేకతే. ఆయన సహృదయత ప్రేమ తత్వం ఇందుకు కారణం అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ రమణాచారి పట్ల ఉన్న అభిమానంతో కళా సప్తహాం జరిపామని ఇందుకు సహకరించిన వారుతో పాటు దినపత్రికల వారిక ధన్యవాదాలు తెలిపారు.

### హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవం ప్రారంభం.. సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

# పుస్తకం చెంతవుంటే పుణ్యాత్ములు వెంట ఉన్నట్టే

### – పద్మశ్రీ పురస్కార గ్రహీత కూరెళ్ళ విఠలాచార్య



పుస్తకం పాఠకుడి వ్యక్తిత్వాన్ని మారుస్తుందని, పుస్తకం చెంతనుంటే పుణ్యాత్ములు వెంట ఉన్నట్టే అని పద్మశ్రీ పురస్కార గ్రహీత, నడిచే గ్రంథాలయంగా పేరున్న కూరెళ్ళ విఠలాచార్య అన్నారు. పుస్తక పఠనం మానవ జీవితానికి పరిపూర్ణత కలిగిస్తుందని తెలిపారు. ఆయన ఎన్టీఆర్ స్టేడియంలోని గద్దర్ ప్రాంగణంలో కొలువుదీరిన 36వ హైదరాబాద్ జాతీయపుస్తక ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విఠలాచార్య మాట్లాడుతూ గాంధీని మహాత్ముడిగా మలిచినది పుస్తకమే అని, మనిషిని మహనీయునిగా తీర్చిదిద్దగలిగేది పుస్తక పఠనమే అని నొక్కి చెప్పారు. పల్లెల్లో చైతన్యం తీసుకురావాలి అనే సంకల్పంతో, తాను ఇంటినే గ్రంథాలయంగా మార్చడంతో పాటు పన్నెండు గ్రంథాలయాల స్థాపనకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. రెండు లక్షల పుస్తకాలతో కొలువుదీరిన తన గ్రంథాలయానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి పరిశోధన విద్యార్థులు వస్తుంటారని వివరించారు. వారిలో 11 మంది పీహెచ్‌డీ డాక్టరేట్లు పొందారని తెలిపారు. గద్దర్, రవ్వా శ్రీహరిలతో తనకున్న అనుబంధాన్ని కూరెళ్ల గుర్తు చేశారు.

ఆచార్య రవ్వా శ్రీహరి సాహిత్య, సాంస్కృతిక వేదికను ప్రారంభించిన ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తక పఠనం సంస్కృతిగా మారాలని ఆకాంక్షించారు. అనేక పుస్తకాలు ఒకచోట లభ్యం అవ్వడంతో పాటు పుస్తకాభిమానులంతా కలుసుకోడానికి ఇదొక మంచి వేదిక అని అన్నారు. కొందరు వ్యక్తిగత చొరవతో గ్రామాల్లో గ్రంథాలయాలు నెలకొల్పి, తద్వారా పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ గ్రంథాలయాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. గ్రంథాలయాల్లో 30 ఏళ్లుగా నియామకాలు లేవని, పదేళ్లుగా పుస్తకాల కొనుగోళ్ళు ఆగిపోయాయని విచారం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం గ్రంథాలయాలను పటిష్ట పరచాలని కె. శ్రీనివాస్ కోరారు. సభాధ్యక్షత వహించిన బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలోనూ పుస్తక పాఠకులు తగ్గడంలేదనడానికి కోల్‌కతా బుక్ ఫెయిర్‌కు లభించిన ఆచదరణకు నిదర్శనం అన్నారు. గద్దర్ పేరుతో జానపద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బుక్ ఫెయిర్ వేదికగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లే ముందు కూడా గద్దర్ పుస్తకం చదివారని తెలిపారు. ఎన్ని పనులున్నా, రోజుకు ఒక గంటైనా పుస్తక పఠనాన్ని కేటాయించే వారని, ఆయన్ను చూసి తమ కుటుంబ సభ్యులు పుస్తక పఠనాన్ని అలవర్చుకున్నట్లు వెన్నెల తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్ రెడ్డి, సుధా భాస్కర్, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

### సంవత్సరానికి 2 సార్లు పుస్తక ప్రదర్శనకు ప్రభుత్వ సహకారం – మంత్రి జూపల్లి



పుస్తక మహోత్సవాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ అమర వీరుల స్మారక స్ఫూరంతో పాటు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్, నవ తెలంగాణ, తెలుగు వికీపీడియా, అక్షరయాన్ స్టాళ్లను ఆవిష్కరించారు. ఏడాదికి ఒకసారి కాదు, రెండు సార్లు పుస్తక ప్రదర్శన నిర్వహించడానికి తమ ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. బుక్ ఫెయిర్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణలను ఆ శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మంత్రికి బహూకరిస్తుండగా, పుస్తకాలు ఉచితంగా తీసుకోవడం సముచితం కాదంటూ వెల చెల్లించారు. మరొక స్టాల్‌లోనూ అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, గోల్కొండ చరిత్ర, గద్దర్ సాహిత్యాన్ని మంత్రి కొనుగోలు చేశారు.




**కవి/కవయిత్రి మిత్రులారా!**
**మీరూ సప్తపదులు రాయవచ్చు**
**అందుకోసం**
**సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో చేరేందుకు గ్రూప్ అడ్మిన్**
**శ్రీ జి.వి.నరసింహమూర్తి(శాంతమూర్తి)**
**97048 67867**
**నెంబర్ ను సంప్రదించండి**

శారదా
చేరదా
చదువులతల్లి చెంతన అఆల
అక్షరవరద పారదా
**-జీ యస్ వీ సత్యనారాయణ** కశింకోట, అనకాపల్లి

తెల్లకోట్లు
నల్లకోట్లు
వైద్యం. న్యాయానికి సంకేతం సమర్థులైతే.
కోటానుకోట్లు
**-అచ్యుతుని రాజ్యశ్రీ,** హైదరాబాద్

ప్రవచనం
హితవచనం
ఆస్తికులకే తప్ప నాస్తికులకు కాదిది పచనం
**-భాగవతుల కృష్ణారావు** , సికింద్రాబాద

దేవుడు
జీవుడు
ప్రతిప్రాణిలో దైవాన్ని చూసే మనిషే –భావుడు
**-గడ్డం దేవీప్రసాద్,** బెంగళూరు.

వీడుకోలు
వేడుకోలు
తప్పదు ఏదో కానుక చేయాలి కొనుగోలు
**-బిక్కునూరి రాజేశ్వర్,** నిర్మల్

తప్పులు
ఒప్పులు
కందువా మార్చగానే కురిపిస్తారు ఎన్నెన్నో మెప్పులు.
**-సింహాద్రి వాణి,** విజయవాడ

బాణం
ప్రాణం
అంపశయ్యనెక్కిన భీష్ముని మదిలో
వాసుదేవుడే త్రాణం
**-విన్నకోట ఫణీంద్ర,** హైదరాబాద్

రాజకీయం
నాటకీయం
ఎదురులేని పంచవర్షాల పాలనా సామర్థ్యనీ
పీవీస్వకీయం!
**-యన్.కే. నాగేశ్వరరావు,** పెనుగొండ

రవికిరణం
శశిధరణం
ప్రపంచానికిఅరోగ్యకరమైన పర్యావరణాన్ని
అందించేందుకు భువిగురణం!
(గురణం=ప్రయత్నం)
**-గోగినేని రత్నాకరరావు** , తెనాలి.

రాసే ఆసక్తి కలవారు సప్తపదులు వాట్సప్ గ్రూప్‌లో చేరి అక్కడ నియమాలు తెలుసుకుని గ్రూప్‌లో రాయండి.రోజూ అక్కడ వందలాదిగా వచ్చేవాటి నుంచి ప్రతివారం ఎన్నికయిన 25 సప్తపదులు "నేటినిజం"లో ప్రచురితం కాగలవు.

ప్రకృతి
వికృతి
పాపపుణ్యాల సమన్వయంలో మనకు
కలుగు సుకృతి
**-ఆర్. రమాదేవి,** అంగుల్

చరితం
దురితం
అణగిమణగి అభివృద్ధి, ఎగిరెగిరితే పతనం
తురితం (తురితం = త్వరగా)
**-వి నాగమణి,** హైదరాబాద్

అడుగు
మడుగు
గతికి మతి – కొరగాని కర్మలను కడుగు
**-విత్తనాల విజయ కుమార్,** హైదరాబాద్

తాగుట
ఊగుట
ఊదావంటే రక్షకభటుల ముందు
ఖాయం మోగుట
**-జీ యస్ వీ సత్యనారాయణ,**హైదరాబద్

దేహం..
మోహం..
కోరికలు విడనాడితే మనిషికి కలుగుతుంది సోహం!!
**-పేరిశెట్టిబాబు,** భద్రాచలం

పొత్తు
ఎత్తు
అప్రమత్తత లేకుంటే ఎన్నికలలో కలలే చిత్తు
**-సూర్యదేవర రవికుమార్,** గుంటూరు

ఇక్కలు
లెక్కలు
ఆకాశం పందిరికి అలంకారమైన నక్షత్రాల చుక్కలు
**-కట్టెకోల చిన నరసయ్య,** ఖమ్మం

పొత్తము
చిత్తము
మనిషికి తెరిచివుంటేనే ఛత్రంలా
పూర్తిగా ఉపయుక్తము
**-వి శ్రీనివాస మూర్తి,** హైదరాబాదు

హితుడు
మహితుడు
పార్థునికి కృష్ణునిలా ఉండాలి ఒక విహితుడు!
**-తెన్నేటి శ్యామకృష్ణ,** హైదరాబాదు

చూడామణి
నాసామణి
అలంకారశోభతో తీర్చిదిద్దిన బాపూబొమ్మలా
కనిపిస్తుంది భామామణి
**-కాళీపట్నపు శారద,** హైదరాబాదు

ప్రకృతి
సుకృతి
పర్యావరణం బాధ్యత అందరిదీ కాదనుట వికృతి!
**-ఎం. వి. ఉమాదేవి,** బాసర.

త్యాగం
భోగం
రెండింటి ద్వారానే దొరుకుతుంది
ఎవరికైనా యోగం.
**-దోసపాటి వేంకటరామచంద్రరావు** విజయనగరం

చిరాకు
పరాకు
ఎందుకు? జీవితం కాదు వడ్డించిన విస్తరాకు
**-గంగరాజు పద్మజ,** హైదరాబాద్

రాక
పోక
దుఃఖం అనుభవిస్తాడు మనిషి శాశ్వతమైనది
తెలుసుకోలేక
**-వి శ్రీనివాస మూర్తి,** హైదరాబాదు

లోకం
శోకం
మన్వంతరాలు మారిపోతున్నా మానవత్వం
మనుగడకేదీ తూకం!
**-క్రొవ్విడి వెంకట బలరామమూర్తి** హైదరాబాద్.

నదులు
కదులు
ఎడారిలో నోరెండినట్టున్న సాహితీప్రపంచంలో
అమృతతుల్యాలు సప్తపదులు
**-ఉమాదేవి పోచంపల్లి గోపరాజు** రిచ్మండ్,టెక్సాస్,అమెరికా

## పరులకు సహాయ పడితే పదవి అర్ధవంతం-శేషశయనారెడ్డి


డా॥కె.వి.రమణాచారి దంపతులను సత్కరిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి.

ఎందరో ప్రభుత్వ పదవులు చేపట్టి ఉండవచ్చని కానీ ఆ అధికారంలో ఉన్నప్పుడు పరులకు సహాయ పడితే సార్థకత చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేష శయన రెడ్డి అన్నారు. రమణాచారి వివిధ పదవుల్లో ఉన్న సమయంలో ఆయన సహకారం పొందిన వారు పదవీ విరమణ చేసిన తరువాత కూడా జన్మదిన సందర్భంలో తమ అభిమానం చూపటం అరుదైన విషయమని జస్టిస్ అభినందించారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై జీ.వీ.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి కె.వి.రమణ జన్మదిన సందర్భంలో హాస్యానందం పత్రిక నిర్వహణలో జరిగిన కార్టూన్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ శేష శయన రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జీవిత ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన వ్యక్తులు వారి వారి రంగాల్లో అభివృద్ధి చెందుతారని ఆయన పేర్కొన్నారు. హాస్యనందం ప్రత్యేక సంచికను సంపాదకుడు పీ.రాము లాంఛనంగా డాక్టర్ రమణకు అంకితమిచ్చారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ దినపత్రికలు తప్పనిసరిగా కార్టూన్స్ ప్రచురించాలని కోరారు. కళాపోషకుడు చిల్ల రాజశేఖర రెడ్డి సాహితీకిరణం సంపాకుడు పొత్తూరి సుబ్బారావు, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మినారాయణ ధార్మిక ప్రచారకుడు కృష్ణామాచార్యులు రచయిత్రి నిర్మల తదితరులు పాల్గొనగా కవి పెద్దూరి వెంకటదాసు కార్యక్రమ నిర్వహించగా సంస్థ స్థాపకడు గుదిబండి వెంకటరెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమానికి తొలుత శిరీష తన శిష్యులు నివేదిత, కిరణ్మయితో కూచిపూడి నృత్యం నర్తించారు.

# గద్దర్ ఎగిసిపడే ఒక ఉద్యమ కెరటం



చిదిమేసిన పువ్వులు త్యాగాల గుర్తులు/

గద్దర్ ఎగిసిపడే ఒక ఉద్యమ కెరటం. రగులుతున్న విప్లవ బావుట. దొరల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ దూసుకుని వచ్చిన పాటల తూటా. శ్రామిక వర్గ పక్షాన నిలబడి తన గళంతోనే దౌర్జన్యాలను నిలదీసిన ఉద్యమకారుడు. సామాజిక, ఆర్థికఅసమానతలపై గొంతెత్తి గాండ్రించిన విప్లవ స్వర యోధుడు గద్దర్. తెలంగాణ ఉద్యమం ఒడిదుడుకులకు గురి అయినప్పుడు గద్దర్ 'ధూంధాం'తో తిరిగి జవసత్వాలను పొందింది. ఆయన పాట ఒక అద్భుతం. ఆయనకు పాటే ఒక ఆయుధం.

'దొర ఏందిరో వాని పీకుడు ఏందిరో' అనే అగ్ని గానంతో ప్రజల్లో ఆవేశాన్ని రేకెత్తించారు. ఐదు దశాబ్దాల సుదీర్ఘ సామాజిక, రాజకీయ పోరాటాలకు గద్దర్ తన పాటలతో ఆయువులూదారు. తెలంగాణ ఉనికి ప్రశ్నార్థకమైన తరుణాన తన పాటతో తెలంగాణ అస్తిత్వాన్ని చాటారు.

ఒక పాట రాసే క్రమంలో ఆయా సంఘటనల పూర్వాపరాలను పరిశోధించి, వివిధ వర్గాల శ్రామికుల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి, ఈ అనుభవాల ఆధారంగా,ఆయా సంఘటనలను తాను స్వయంగా అనుభూతి చెంది రాయడం వల్ల గద్దర్ పాటల్లో సహజత్వంతో పాటు వాస్తవికత ఉట్టిపడుతుంది. పరిమళాన్ని నింపుకున్న పువ్వులు వలే, గద్దర్ పాటల్లో తెలంగాణా తత్వం ఆద్యంతం తొణికిసలాడుతుంది.

1979 సంవత్సరంలో 'మాభూమి' సినిమాలో గద్దర్ పాడిన 'బండెనక బండి కట్టి.. పదహారు బండ్ల కట్టి' అనే పాటలో నిజాం పాలకుల దురాగతాలను వివరించారు. ఆ పాటే ఒక ప్రభంజనమై ప్రజల్లో ఉద్యమ కాంక్షను రగుల్కొల్పింది. ఆ ఒక్క పాట నిజాం వ్యతిరేక ఉద్యమానికి మరింత ఊపు తెచ్చింది. గ్రామగ్రా మాన ప్రాచుర్యం పొందింది. అంతకు ముందు 1971లోనే 'ఆపరా రిక్షా' చిత్రంలో ఓ పాట రాశారు గద్దర్. ఆ తర్వాత గద్దర్ పేరుతో తన మొదటి ఆల్బమ్ చేశారు. గుమ్మడి విఠల్ రావుగా ఉన్న ఆయన పేరు ఈ ఆల్బమ్ తర్వాతే 'గద్దర్'గా మారింది.

వందనాలు వందనాలమ్మో మా బిడ్డల్లారా.. ఆ సమయంలో గద్దర్ పాడిన పాట యువతను విశేషంగా ఆకట్టుకొంది. ఆనాడు తెలంగాణ ప్రాంతంలోని పరిస్థితులకు అద్దం పట్టేలా ఆ పాటలుండేవి. గద్దర్ పాటలకు ఆకర్షితులైన ఎందరో పీపుల్స్ వార్ ఉద్యమంలో చేరినట్టుగా వారి మాటల్లోనే తెలుస్తుంది.

'ఒరేయ్ రిక్షా' సినిమా కోసం 'మల్లె తీగకు పందిరి వోలె' (నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా) అంటూ రాసిన పాటలో చెల్లెలిపై (స్త్రీలపై) అన్నకు ఉన్న అభిమానాన్ని అందమైన మాటలతో పొందుపరిచారు. జై బోలో తెలంగాణా సినిమాలో తెరపైన కనిపించారు. 'పొడుస్తున్న పొద్దు' మీద పాట ఆయనే రాసి పాడి, అభినయించారు. ఈ పాట అద్భుత విజయం సాధించింది. ఈ పాట నంది అవార్డు ను సైతం కైవసం చేసుకుంది.

ఈ పాటలో **''భూదేవి బిడ్డలుచిగురించిన కొమ్మలు/ చిదిమేసిన పువ్వులు త్యాగాల గుర్తులు/"** అంటూ ఉద్యమం లో అసువులు బాసిన వీరులంతా చిదిమేసిన పువ్వువంటివారని వీరంతా త్యాగాల చిహ్నాలని అభివర్ణించిన తీరు హృద్యమైనది. గోదావరి అలలమీద కోటి కలల గానమా/ కృష్ణమ్మ పరుగులకు నురుగుల హారమా' అంటూ మహోన్నతమైన తెలంగాణ ఉద్యమ ఉధృతిని శిల్పశోభితంగా చిత్రించాడు. 'మర్లబడ్డ గానమా', 'తిరగబడ్డ రాగమా', 'కత్తుల కోలాటమా', 'పువ్వులు పుప్పొడిలా పవిత్ర బంధమా', 'పరమాత్ముని రూపమా' లాంటి అపురూపమైన సంబోధనలతో అభివ్యక్తి సుందరంగా తెలంగాణ పోరు తత్వానికి గద్దర్ కొత్త భాష్యం చెప్పాడు. తెలంగాణపై జరిగిన వనరుల దోపిడిని తీవ్రంగా ఎండగట్టాడు.

మలిదశ తెలంగాణ పోరాటానికి గద్దర్ పాటలు ఎంతో ఉత్తేజాన్ని అందించాయి. 'అమ్మా తెలంగాణ మా ఆకలి కేకల గానమా' అనే గీతంలో తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవ ప్రాభవాలను గద్దర్ అద్భుతంగా అక్షరీకరించారు.

**'ఎడ్లోల్ల మట్టి చిప్పవు/ గాయిదోల్ల గండ్ర గొడ్డలిని'** అంటూ దళిత, బహుజనుల అస్తిత్వం కేంద్రంగా తెలంగాణను ఔచితీమంతంగా అభివర్ణించాడు. విశిష్టమైన ఈ రెండు సంబోధనల్లో అణగారినవర్గాల శ్రమతత్వాన్ని, వారిలోని ప్రతిఘటనాత్మక వైఖరిని గద్దర్ ప్రతీకాత్మకంగా ప్రస్తుతించాడు. గద్దర్ తాను రాసిన పాటల వెనుక ఒక అశ్రు బిందువు, అగ్నికణాన్ని దాచిపెట్టాడు. "ప్రతి పాట వెనుక ఓ కథ ఉంటుంది. ఆ కథ వెనుక కష్టజీవుల కన్నీళ్ళు, సెమట సుక్కలుంటాయి.

ఆ కన్నీళ్లను చెమట సుక్కలు దోచుకునే దొంగలుంటారు. ఆ దొంగలను ఎదురించే వీరులుంటారు" అని తన ప్రతి పాట వెనక ఒక వీరగాథ దాగి ఉంటుందని గద్దర్ సూచిస్తాడు. వందలాది పాటలు ప్రజల వాడుక మాటలుగా మార్చిన విప్లవ వాగ్గేయ కారుడు. సాహిత్యోద్యమ సాగరంలో ప్రజా యుద్ధనౌకగా పయనించిన గాయకుడు గద్దర్.

అంతటి భావోద్వేగ తీవ్రత కలిగిన గద్దర్ తన అమ్మను స్మరించుకుంటూ రాసిన "సిరిమల్లె సెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా" పాటలోని సామాజిక, వైయక్తిక ఆర్తిని విందాం. గద్దర్ ఈ పాట రాయడం వెనుక బలమైన నేపథ్యం ఉంది.

విప్లవోద్య మంలో తిరుగుతూ తల్లికి తన జాడ తెలియని పరిస్థితులు అవి. అను కోకుండా ఒక రోజు రోడ్డుమీద తన ఊర్లోని ఒక పేద రైతు గద్దరుని గుర్తుపట్టాడు. ఆ రైతు సంతోషంతో గద్దర్ ఒళ్లంతా నిమురుతూ "ఎంత మంచి వానివి గిట్ల పోయినవ్.. మన ఊరుకు పోదాం. ఊళ్లో బత్కుదువ్?. మీ అమ్మ ఆ చింతచెట్టు కింద కూసోని, కొడుకా, కొడుకా అని పక్షి వొలపోసినట్టు వొలపోస్తుంది" అన్న మాటలతో గద్దర్ లోని కవి హృదయం చలించిపోయింది. తను కన్పించినట్టు అమ్మకు చెప్పొద్దని రైతుతో చెప్పాడుగాని గద్దర్ మనస్సు సొంతూరికి వెళ్లిపోయింది. "ఇంటి ముందు చింతచెట్టు కండ్లలో తిరిగింది. అమ్మ అనుభవించిన కష్టాలు, ఈ వయసులో కూడా కూలి తల్లిగా పడుతున్న కష్టాలు అన్నీ కళ్ళముందు తిరిగాయి. అంతే సిరిమల్లె చెట్టుకింద సినబోయిన పాట మొదలయ్యింది. **సిరిమల్లె సెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మానీవు సినబోయి కూసున్నవెందు కమ్మో ఎందుకమ్మా.** అంటూ ఆర్తిగా తన తల్లి పడే కష్టాలను, ఆమె వేదనలను పాటగా కళ్లముందుంచారు. ఈ పాట విన్నాక చెమర్చిన కన్ను,భారమవని హృదయం ఉండదంటే అది అతిశయోక్తి కాదు.

ఈ పాట కేవలం గద్దర్ తన తల్లి కోసం మాత్రమే కాక,ఉద్యమాల కోసం ఎందరో అడివిబాట పట్టగా వారికోసం ఏడుస్తున్న అనేకమంది తల్లులకోసం కూడా..నా రక్తంతో నడుపుతాను రిక్షాను..నా రక్తమే నా రిక్షకు పెట్రోలు.. అంటూ శ్రామికుల వెతలను పలికించినా..బానిసలారా లెండిరా.. ఈ బాంచన్ బతుకులు వద్దురా..అంటూ కదం తొక్కినా.. అడవి తల్లికి వందనం, పొద్దుతిరుగుడు పువ్వా, భద్రం కొడుకో, జంజమలబరి, మేలుకో రైతన్న వంటి పదాలు పాడినా..నన్నూ గన్న తల్లులారా తెలుగు తల్లి పల్లెలారా.. పాటనై వస్తున్నానమ్మో, మీ పాదాలకు వందనాలమ్మో..అంటూ గుండె తడి చేసినా అది గద్దర్ పదాలకే సాధ్యం. గద్దర్ పాటలెన్నో నేటికీ ప్రజలను అలరిస్తూనే ఉంటాయి. గద్దర్ పాల్గొనని ఉద్యమం లేదు. ఏ ఉద్యమంలో ఉన్నా అవన్నీ ఆయన ఆటపాటతో ఊపిరిపోసుకున్నవే.ఆయన పాటఒక డైనమేట్.. ఆ పాట వేలాదిమందిని తుపాకుల బాట పట్టించింది.

సమసమాజ స్థాపన కోసం ఆయన పాట ఓ పెద్ద యుద్ధాన్ని నడిపింది. నడిపిస్తూనే ఉంది. విప్లవ మార్గాన కార్యాచరణలో పాట ముందున్నది, పాట తిరుగుబాటు నేర్పింది. ఏకంగా జననాట్యమండలి దళాలను ఏర్పాటు చేసి, విముక్తి పోరాటానికి గద్దర్ పాట ఊపిరి పోసింది. ప్రారంభదశలో ఉద్యమ స్ఫూర్తితో 'పోరు తప్ప దారి లేదని' తెగేసి చెప్పిన గద్దర్, అంతిమదశలో ఆత్మగౌరవ పోరాటాల లక్ష్యంతో భారత రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య బాటలోకి నడచివచ్చాడు. 'ఏడుతరాల త్యాగాల జ్ఞానయుద్ధాల గ్రంథం, మానవ జాతి విముక్తిగీతం' అంటూ రాజ్యాంగ విలువల ఆచరణ ఆవశ్యకతను విశదపరిచాడు. ఈ రకమైన గుణాత్మక పరివర్తనతోనే 'బాబాసాహెబ్ బాటరా.. భావితరాల బాటరా! అని గద్దర్ నిర్ధారించాడు. దండకారణ్యాన్ని తన గళంతో, కలంతో రగిలించిన 'ప్రజాయుద్ధ నౌక' గద్దర్ చివరికి బుద్ధుని పథంలో,రామానుజాచార్యుని భక్తి భావలహరిలో ఓలలాడి,అద్భుత పాటల నేతగాడిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.



**-డా॥ఎన్. సిహెచ్. సుధా మైథిలి**
గుంటూరు

# ఇచ్చిన హామీలు ఎప్పుడు పూర్తి చేస్తారు.. ఎమ్మెల్యే కడియం.

హైదరాబాద్, ఫిబ్రవరి 14:కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఏడాదికి రూ.1.36 లక్షల కోట్లు అవసరమని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. భారాస పదేళ్ల పాలనలో ఆర్థిక అభివృద్ధి జరిగిందంటూ గణాంకాలను చదివి వినిపించారు.

"కేసీఆర్ పాలనతో తెలంగాణలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరిట 13 హామీలు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, యువత, రైతు, మహిళా డిక్లరేషన్లు ప్రకటించారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు లెక్కిస్తే 420 ఉన్నాయి. ఆరు గ్యారంటీల అమలకు ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ సరిపోదు. రుణమాఫీ సహా ప్రకటించిన డిక్లరేషన్లకు అయ్యే వ్యయం దీనికి అదనం. డిసెంబర్ 9న రైతు రుణాలను మాఫీ చేస్తామన్నారు.. అదే మేం అడుగుతున్నాం.

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. 119 నియోజకవర్గాల్లో 4.16లక్షల ఇళ్లకు రూ.24వేల కోట్లు అవసరం. బడ్జెట్‌లో కేవలం రూ.7వేల కోట్లే కేటాయించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామన్నారు. ఇంటిలో ఒక్కరికే ఇచ్చినా రూ.20వేల కోట్లు కావాలి. ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. రైతు రుణమాఫీ ఏవిధంగా.. ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి.

కాళేశ్వరం ద్వారా కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరణ జరిగింది. ఆ ప్రాజెక్టు విషయంలో గోరంతను కొండంత చేసి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దు. కాళేశ్వరంతో అనేక రిజర్వాయర్లు వచ్చాయి.. నీటి నిల్వ సామర్థ్యం పెంచుకున్నాం. ఈ ప్రాజెక్టులో బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, కెనాళ్లు, సబ్‌స్టేషన్లు ఉన్నాయి. దీనిలో ఒక భాగమైన మేడిగడ్డలో కేవలం 2, 3 పిల్లర్లు కుంగిపోయాయి. ఈ అంశంలో బాధ్యులపై చర్యలు తీసుకోండి.. మాకు అభ్యంతరం లేదు" అని కడియం శ్రీహరి అన్నారు.

# అరకొర ఆర్టీసి సేవలు.. అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 14:మూడు మండలాలతో పాటు మహారాష్ట్ర ప్రజల అవసరాలకు కేంద్ర బిందువైన చెన్నూరు నియోజకవర్గ కేంద్రానికి ఆర్టీసి సేవలు అరకొరగా సాగుతున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. చెన్నూరు కేంద్రంగా చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల ప్రజలతో పాటు సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్ర ప్రజలు నిత్యం హైదరాబాద్, కరీంనగర్ వరంగల్, మంచిర్యాల పట్టణాలకు చెన్నూరు కేంద్రంగా ప్రయాణాలు సాగిస్తుంటారు.

మంచిర్యాల డిపోకు అధిక ఆర్థిక వనరుల సమకూర్చే ప్రాంతానికి ఆర్టీసి అధికారులు బస్సులు కేటాయించడంలో వివక్షత చూపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెళ్ళిల సమయంలో మరింత ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణి కులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి చెన్నూరు ప్రాం తానికి సమయానుకూలంగా బస్సులు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం

ఏకాంశ కవిత్వం



నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1083వ రోజు 'పుస్తకాల పండుగ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'పుస్తకాల పండుగ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా సమర్పిస్తున్నాం.

-సంపాదకులు

## ప్రపంచ పర్యటన

రండి!
అలా వెళ్ళి
విజ్ఞాన మకరందం వెదజల్లే
పువ్వుల పుటలను దర్శిద్దాం!.
అలా ఊహల రెక్కల గుర్రమెక్కి
అంతరిక్షంలో అడుగుపెడదాం!.
ఆసక్తి తొడుగు ధరించి
కుతూహలం గొట్టం తగిలించుకుని
సముద్రపు అడుగున
మెరిసే జ్ఞాన పగడపు
దీవులు సందర్శిద్దాం!.
అక్షర కాలయంత్రమెక్కి
అలనాటి చరిత్ర గతులను
తెలుసుకుంటూ
ఏకచ్ఛత్రాధిపత్య చక్రవర్తులను
స్వేచ్ఛకై పోరాడిన
వీర నారీమణుల
శౌర్యాన్ని కొనియాడుదాం!.
కోటి వెలుగుల
విద్యా దీప కాంతిలో
మనోల్లాస వెన్నెల విందు
భోజనం చేద్దాం!
అంతేనా...
అద్భుత శిల్పకళలను పరికిస్తూ
అజరామర
కవితామృతాలను ఆస్వాదిద్దాం
కమ్మని కథల ఆదరువులతో!
తయారుగా ఉన్నారా
అందరూ...
పుస్తక ప్రపంచ పర్యటనకు?.

-చంద్రకళ దీకొండ

## జీవన రహదారి మార్గసూచిక

సాహిత్య పంటల తరువులకు
ప్రతి పుస్తకం
ఒక కొమ్మలా రెమ్మలా
చిగురేసి
కుసుమ శోభిత వికసితమే
మానసం
ఫల రుచుల పరిపక్వమే.
పంట విస్తరిస్తే మంచి గంధం
గుబాళింపులే ప్రపంచమంతా
శోభలద్దుకుని విలువల వలువలు
తొడుక్కున్న రూపమై అంతా రమ్యమే.
శిలను శిల్పంగా మార్చే శిల్పిలా
కర్రను బొమ్మగా మలిచే వడ్రంగిలా
దూదిని దుపట్టాగా నేసే నేతన్నగా
అజ్ఞానుల తీర్చిదిద్దే జ్ఞానజ్యోతి.
ఒకప్పటి హస్త భూషణం
చిన్నబోయి చిక్కుల్లో చిక్కుకుంది
బుంగమూతితో
వామనునిలా వ్యాపించిన
నంగనాచి తెరలవాణి ముందర .
విరిజల్లుల పరిమళాలు
విస్తరించాలంటే
అలాంటి పుస్తకాలు అందరికి
అందుబాటయ్యే సౌకర్యమే
ప్రదర్శనల అంతరార్థం.
ఆణిముత్యాల్లాంటి అరుదైన
హస్తభూషణాల భోషాణం
జీవన రహదారులకు మార్గసూచికై
భావ పరిమళాల
పరివ్యాప్తికి తోడవుతాయి .

- నగునూరి రాజన్న

## విజ్ఞానం

సూర్యోదయం మొదలు
మనిషి విజ్ఞానానికి విలువ
పుస్తక రచన
ప్రచురణ
ప్రదర్శన
అమ్మకం
ఒకే చోట ఎన్నో జ్ఞాన నిధులు
మానవ ప్రగతికి
ఉన్నతికి
మూల కారణం
పుస్తకాలు
ఎన్నో రకాల పుస్తకాలు
ఎందరో మేధావులు సృష్టి
పుస్తక పఠనానికెంతో విలువ
ఎన్ని విద్యలు
విషయాలు
పుస్తకంలో పొందుపరిచి
భావితరాలకు అందించడానికి
ఒక అద్భుత కృషి
ఎన్నో తరాలకు
ఈ ప్రదర్శనలతో
విజ్ఞానవ్యాప్తి.

-నారుమంచి వాణీ ప్రభాకరి

## పొత్తముల జాతర

జ్ఞానం విజ్ఞానం
మేనుల నిండా దాచుకొన్న
పొత్తముల జాతర.
పుటల నిండా
అమూల్య అక్షరనిధులు
పొదువుకున్న
పుస్తకభాండాగారాలు
కొలువుదీరిన వేదిక.
కాలగర్భంలో...
గతమైన ఘనచరిత్రలు
ఆదిమానవుడి నుండి
ఆధునికమానవుడి
అభివృద్ధి పరిణామ ప్రస్థానాలు.
అనాది నుండి నేటి వరకు
మారిన నాగరికతల రూపురేఖలు
కణం నుండి జీవం ఎదిగిన
జీవవిజ్ఞానాలు
యంత్రరచనలు
దాగిన శాస్త్రీయ రహస్యాలు
అన్నింటినీ స్పృశిస్తూ
అవగతం చేసే విజ్ఞాన కోశాలను
అందుబాటులోకి తెచ్చిన
ప్రాంగణం.
పండితపామర జనరంజకమైన
కళాసాహిత్య అంశాలు
ఆబాలగోపాలాన్ని అలరించే
మురిపించే
కథలు
కథానికలు
పద్యాలు
పాటలు
నాటకాలు
నాటికలు
జానపద పదపరిమళాలు
అక్షరబద్ధమై
ఒదిగిన సాహితీకళాదొంతరలు
కూర్చిన సారస్వతరూపాల
అపురూప ప్రదర్శనశాల
మన చెంతనే కొలువుదీరిన
పుస్తకప్రదర్శన
ఎందరెందరో
ఉద్దండులైన కవులు, రచయితలు
చివురులు తొడుగుతున్న వర్తమాన కవులు
కలాలతో అక్షరసేద్యం చేసి
అందించిన అక్షర జ్ఞానఫలాలను
ఆస్వాదించమని
నిన్ను..నన్ను..
అందరినీ
సాదరంగా ఆహ్వానిస్తోంది
రా..రమ్మనీ
చారిత్రక
విజ్ఞాన కళాసాహిత్య భాషాసంపదలను
ఆభరణాల మాలికలను
మేనుల ధరించి
మీ మేనుల..
గృహసీమల అలంకరించమనీ
అభిలషిస్తోంది.

- మధు జెల్లా

## పదిరోజుల పండుగ

పదిరోజుల పండుగ
కనుల విందుగా
బహుపసందుగా
మస్తకాలు
మస్తు మస్తు గా
వేవేలు
తెలంగాణ కళాభారతి లో
కొలువు తీరగా.
అక్షరాల గవాక్షాలు
అందమైన చిత్రాలు
సాహితీప్రియుల మనసు నిండుగా
చూసేవారికి కన్నులపండుగ
కమ్మనైన విందు
రచయితల వద్దనలు ఆస్వాదించే
ఆనందించే పూదోట
విజ్ఞాన వినోదాల బాట
వివిధ రాష్ట్రాల దేశాల
పొత్తాలు పొత్తులతో ఒద్దికగా
కొలువై రారమ్మనీ
చాచు హస్తాలు
అక్షర విన్యాసాలు
అందాల అపురూప సింగిడీలు
డిస్కౌంట్లో చేతుల్లో వాలు.
సాహితీ వేత్తల సందడి
విద్యార్థులకు రకరకాల పోటీలు
గద్దరన్న యాదిలో గద్దెపై
ముఖాముఖీలు చైతన్య దీపాలు
కోల్కతా ప్రదర్శనను మించేలా
తెలంగాణ సత్తా చాటేలా
రారమ్మని పిలుస్తోంది.

-ఎ.రాజ్యశ్రీ

## చదువరులకో వరం

ఏడాదికోసారి జరిగే పండగ
కన్నుల పండగ గా
కడుపునిండుగా
పుస్తకాలపండగ
ఉత్తర దక్షిణాది రాష్ట్రాల
వందలాది ప్రచురణ సంస్థల
అపురూప అరుదైన పుస్తకాలు
అందంగా అమర్చి అమ్మే చోటు.
పుస్తకప్రియులకి సంబరం
చదువరులకో వరం
అపారమైన శాస్త్ర సాంకేతిక
అభివృద్ధి నేపథ్యంలో
పుస్తకానికి పెద్దపీట
సాహిత్యభిలాష
పెంపొందించే దిశగా పయనం
ప్రతి వారిచేత
చదివించాలనే లక్ష్యం
సోషల్ మీడియా వెల్లువలోనూ
తరగని పఠనాభిలాష.

-మోటూరి శాంతకుమారి

## అక్షర నిధి

కవితలు
కావ్యాలు
రచనలు
జాలువారే అమూల్య ప్రదేశం.
గ్రంథాలు
కావ్య సుగంధాలు
పవిత్ర గ్రంథాలు
పొందుపరచు స్థానము.
అందరి డెంధములు
అలరించే స్థలమే ఈ
పుస్తక ప్రదర్శన శాల
శారదా మాత గుడి
ఈనాడు ఆ దేవాలయం
అందే అదృష్టం అందరికీ
అదే ప్రదర్శనశాల
అందుబాటులో పుస్తకాలు.
కవితా నిధులు కోకొల్లలు
చేతరాసినది చేరునెచ్చటికో
బుద్ధిలో నిక్షిప్తం
పుస్తక నిక్షిప్తం
బంగారు నిధి.
ఆ నిధి అనువుగా పొందే
అవకాశమే
ఈ పుస్తక ప్రదర్శన శాల
అందరికి వెసులుబాటు
అపురూపం!!.

-కె.కె.తాయారు

## స్నేహమయి

పుస్తకం స్నేహమయి
మానసిక పరిస్థితి చక్కదిద్ది
విజ్ఞాన జ్యోతి ప్రకాశం చేయగలదు
ఒంటరితనాన్ని రూపుమాపుతుంది
ధైర్య సాహసాలను
తృప్తిని
జీవిత సంక్లిష్టతలను
ఎదుర్కొనే శక్తి నిచ్చేది
మనసు ఆనంద ఉయ్యాల లూగేది
కవిత్వ పటిమను
ఆలోచన సరళిని పెంపు చేస్తుంది
బతుకు బాటలో పుస్తకాల పఠనానికి
ఎంతో ప్రాముఖ్యత
ఈ ప్రపంచంలో
పుస్తక నేస్తాలు
రచయితలు
పాఠకులు
ఎందరో మహానుభావులు
పుస్తక ప్రియులు
సాహితీవేత్తలు
సాహిత్య అభిమానులు
వారందరి కోసం
పుస్తక ప్రదర్శన అమూల్యం
ఎంతో మహత్తు చూపే
పుస్తక ప్రదర్శనం
తప్పక దర్శనీయం.

-ఆర్.రమాదేవి

# మెడికల్ కాలేజిలో ర్యాగింగ్.. ఇంటి దారిపట్టిన విద్యార్థులు..

కరీంనగర్, ఫిబ్రవరి 14:ర్యాగింగ్ కట్టడికి ఎన్ని చర్యలు తీసుకున్నా కాలేజీలను ర్యాగింగ్ భూతం వదలడంలేదు. తరచుగా జూనియర్ విద్యార్థులు వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఎంత అవగాహన కల్పించిన ఫలితం లేకుండా పోయింది. ర్యాగింగ్ నుంచి తప్పించుకునేందుకు విద్యకు దూరమవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అలాంటి ఘటనే తాజాగా పెద్దపల్లి జిల్లా రామగుండం వైద్య కళాశాలలో జరిగింది.

ర్యాగింగ్ పేరుతో సీనియర్లు రెచ్చిపోయారు. అర్ధరాత్రి జూనియర్ల హాస్టల్ రూమ్ లలోకి చొరబడి వేధింపులకు గురిచేశారు. ఇద్దరు విద్యార్థులకు గుండ కొట్టి, మీసాలు తొలగించారు. దీంతో భయాందోళనకు లోనైన ఆ విద్యార్థులు తెల్లారి ఇంటికి వెళ్లిపోయారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీనియర్ల ఆగడాలతో విసిగిపోయిన జూనియర్ విద్యార్థులు కాలేజీలో ఆందోళన చేపట్టారు. వైస్ ప్రిన్సిపాల్ ఛాంబర్ ముందు బైఠాయించారు.

రామగుండం మెడికల్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతూ, కాలేజీ అనుబంధంగా ఉన్న హాస్టల్ లో ఉంటున్న ఇద్దరు విద్యార్థుల గదుల్లోకి

# తొణకని వాక్యం 'గద్దరన్న' పాట

అక్షరాలను మూటలుగా పేర్చుకొని
పల్లె పదాలను ఒక్కొక్కటిగా పాటల పరవళ్లు దొక్కించి
జన జాతరలో తన గళాన్ని బిగ్గరగా వినిపించి
తెలంగాణమంతటా తన కంఠం కదం తొక్కి
ఉద్యమానికి తొలిపొద్దు సూర్యుడైండు.

కలం గళంతో కాళ్ళగజ్జల సవ్వుళ్లతో సహవాసం జేసి
ఊరూరా పిడికిలి బిగించి పోరుకు సిద్ధమై
పల్లెబాట పట్టించిన ఎర్ర గొంగ్గడి పిల్లగాడు
చేతిలో ఊతకర్ర బిగియబట్టి ఊతమిచ్చి
పాటల తనఖాను తడిమిన తుంటరోడు
తన పాటల పూదోటలో అసమానతలను నేల రాల్చి
ప్రజాస్వామ్యాన్ని మల్లె పందిరిలో లతలు అల్లిండు.

ఉద్యమాల ఊటలో ఊపిరి సల్పి
కళామతల్లి వొడిలో కవన కాంతులు జల్లిండు
ఎందరో వీరుల స్మృతి గీతాల విత్తులు జల్లి
భావి తరానికి చరిత్ర ఆనవాళ్ల చిహ్నాలు పర్సి0డు
ప్రజల చెంతనే నడియాడుతూ
కలల సాకారానికి సమర శంఖం పూరించిండు
నీతి తప్పిన పాలకుల గుండెల్లో
తుపాకీ తూటాలు పేల్చకుండా
ఉక్కు పదాలు పేల్చిండు.

బుల్లెట్ దెబ్బలకు దడుసుకోకుండా
జనం గుండెలో పాటల తోటమల్లై వెల్సిండు
నిత్యం పల్లె పాటల గూడులను కట్టుకుంటూ
బతుకు వనంలో గులాబీ రేణువులు రువ్వినందు
పెత్తందారుల పోకడలకు విసిగి వేసారినప్పుడు
పాటల తూటాలను గుండెల్లో గునుపాలు దించిండు
దేహాన్ని గాయపర్చుకొని గేయంగా మల్చుకున్నోడు
ఉక్కుపాదాల బిగి కౌగిలిలో ఒత్తుగిల్లిన పాటగాడు
అస్త్రాలను శస్త్రాలుగా గుప్పించి
అవినీతి మరకలు అంటిముట్టని తైతక్కలోడు
ఆయుధాన్ని మసకేసి
సిల్క నవ్వులను పాటలుగా మల్చిండు
ఎందరెందరో పాటల క్షేత్రంలో పురుడోసుకొని
కన్నతల్లి వొడిని వీడి జనం గాథల్లో పాటలై మెర్సిండ్రు
మార్పుకు తీర్పు సూర్యులై వెల్సి
గద్దరన్న ఆత్మలో పాటల పుటల నౌకలైండ్రు
అడవుల కనుసన్నలలో తనువును సింగరించుకొని
దేహాన్ని ఎర్రజెండా గుత్తను పిడికిట్లో బిగియించి
కంఠనాదం పాటల తుంపర్లు రాల్చి
రాజ్యాంగం హక్కుల సౌగంధికాలు
ప్రజల వాకిట్లో పూల ఏరులై పారంగా
రాజకీయ రణరంగంలో నెత్తుటి మర్కలు
పల్లె వొడిలో రక్తసిక్తం తానం జేస్తుంటే
గుడిసె గుడిసెకు సూరుకు సెక్కిన తోరణమోలే
ఎండినాకులు వొంకలు తిరిగినట్లు
సాధనపరుల శ్వాస గళాలు నేల రాలినయ్.

ప్రజా యుద్ధనౌక పోరాటం సల్పి
తెలంగాణ గుండె సడులలో తన నడక,హొయలు
పాటల సరాగాలు గంగ తరంగమై పారుతుంటే
పాయలు పాయలుగా సుడులు తిరుగుతూ
పల్లెతల్లి పొత్తిళ్లను మనసారా తడిమింది
గద్దరన్న చావుకు
దద్వక పాటల దమరుకాన్ని మోగించి
ఎందరో పాటగాళ్లకు రథసారథి
పాటలనే ఆయుధంగా మల్చుకొని
ప్రజల హృదయ సవ్వడులను ప్రేరణ గల్పించి
చైతన్య రుధిరాన్ని రంగరించినోడు
ఊరూరు కలియ దీరుగుతూ
గజ్జల సరుపులను అదిమించి
హింస కాండలను ఎగదన్ని
అహింస పర్వాన్ని పల్లెల్లో మల్లెలు జల్లి
యువతకు ప్రేరణమనే జీవమిచ్చి
జీవన గమనంలో ఒడిదుడుకులు ఒంపుకొని
కష్టాల కడగండ్లు దాటుకుంటూ
రేపటి తరానికి ఉదయ గీతికలు పర్చండి
గద్దరన్న ఓ నవ్య తరంగమై
జగతికి పాటల పూదోటలో నాట్యమాడి
ఎన్నెన్నో సిత్రాలు,
శివాలు కవుల కవనంలో ఊగిసలాడిండు
చెదరని సింహ స్వప్నంలా నీ చిహ్నం
ఏటేటా నీ స్మరణంలో 'గద్దరన్న' అవార్డై
సినీ వినీలాకాశంలో మధురానుభూతులు
సినుకు జల్లులై తార గనానికి
పూల గంధమై మెడలో 'హార'మైండు
'గద్దరన్న' జగానికి జాగురూకతను నేర్పిండు
పాటకు ప్రణవాన్ని నేర్పి
ఆకాశంలో హరివిల్లులై మెర్సిండ్రు.



**-డా.ఓర్సు రాజ్ మానస**
9849446027

# ఉదయసాహితి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీదాస్యం లక్ష్మయ్య, వురిమల్ల సునంద





ఉదయసాహితి సంస్థ 2024- 26 సంవత్సరాలకు గాను రాష్ట్ర కార్యవర్గాన్ని సంస్థ గౌరవాధ్యక్షులు దాస్యం సేనాధిపతి ఆదివారం రోజున ప్రకటించారు.

అధ్యక్షులుగా శ్రీదాస్యం లక్ష్మయ్య, (గోదావరిఖని, ఉమ్మడి కరీంనగర్) ఉపాధ్యక్షులుగా అన్నాడి గజేందర్ రెడ్డి, (కరీంనగర్) అంబటి నారాయణ (నిర్మల్, ఆదిలాబాద్) కొమురవెల్లి అంజయ్య (సిద్దిపేట, మెదక్) డా.చీదెళ్ల సీతాలక్ష్మి (హైదరాబాద్) పూదత్తు కృష్ణమోహన్ (జడ్చర్ల, మహబూబ్ నగర్) ప్రధాన కార్యదర్శిగా వురిమళ్ల సునంద ( ఖమ్మం) సహాయ కార్యదర్శులుగా గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ (చేర్యాల, వరంగల్) అల్లాడి శ్రీనివాస్ ( మంచి ర్యాల, ఆదిలాబాద్) బత్తిన గీతాకు మారి (సత్తుపల్లి, ఖమ్మం) విజయలక్ష్మి మార ( జగిత్యాల, కరీంనగర్) కోశాధికారిగా డా. బి.సుధాకర్. ( సిద్దిపేట, మెదక్) లను నియమించడం జరి గింది.

మహిళా కార్యదర్శిగా రమాదేవి కులకర్ణి(హైదరాబాద్), ప్రచార కార్యదర్శిగా వాసరచెట్ల జయంతి (హైదరాబాద్) మరియు కార్యవర్గ సభ్యులుగా నస్రీన్ ఖాన్(హైదరాబాద్) శిరిశనహల్ శ్రీనివాస మూర్తి (మోర్తాడ్, నిజామాబాద్), అక్కి నర్సింలు గౌడ్ (మల్లాపూర్, రంగారెడ్డి), రుక్మిణీ శేఖర్(బాన్సువాడ, నిజామాబాద్), పులి జమున (మహబూబ్ నగర్) పద్మలత నరహరి (చర్ల, ఖమ్మం), భానుశ్రీ కొత్వాల్ (నల్గొండ), బుక్కపట్నం రమాదేవి (హైదరాబాద్), ఉదయశ్రీ ప్రభాకర్ (వరంగల్), మెన్నేని శశి కిరణ్మయి (కరీంనగర్) లను నియమించినట్లు దాస్యం సేనాధిపతి ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

రెండేళ్లపాటు కొనసాగే ఈ రాష్ట్ర కార్యవర్గం సమన్వయంతో పనిచేస్తూ సాహిత్య సేవలో సామాజిక బాధ్యత ను నెరవేర్చి సంస్థ పురోభివృద్ధికి ఇతోధికంగా సహకరిం చాలని కోరుతూ నూతన కార్యవర్గ సభ్యులకు ప్రకటనలో వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

**-దాస్యం సేనాధిపతి**
గౌరవాధ్యక్షులు
,ఉదయసాహితి




## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక

# 'బుధవారం బాద్షా'



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123



నిర్వహణ:
**శ్రీమతి సత్య నీలిమ**

(ప్రథమ)

## చెదరని అక్షరాలు

ఆనాటి రాజుల పరిపాలనలో
వారి వారి శాసనాలను వారు
శిలలపై చెక్కించి పెట్టేవారు
తరతరాలుగ చెక్కు చెదరవని.
హంపీ విజయ నగర రాజుల
కాలంలోని శిలాక్షరములింకా
అచట మనం గాంచవచ్చును
తులు వంశజుల శాసనములను.
శ్రీకృష్ణ దేవరాయల నాటి వైభవం
ఇప్పటికి శిలాక్షరాలు తెలుపును
ఏకశిలా నగరమున నాటి చరితం
ఇంకా మనకు కనులకు గోచరమగు.
మహాబలి పురమున పాండవుల
చరితమును నాటి రథములను
శిలలపై చెక్కిన విధం అద్భుతమే
ప్రాచీన దేవాలయాల పైనను
శిలాక్షరాల చిత్రీకరణ విచిత్రమే.
వేలాది వత్సరాల రాజుల
పరిపాలనా గుర్తింపులను
చరిత్ర కారులు కనుగొంటారు
మన దేశ చరిత్ర తెలిసికొనుటకై

**-అక్కి నర్సింలు గౌడ్,**
రంగారెడ్డి జిల్లా

## వారసత్వ నిధి

సరస్వతీ రూపాలైన అక్షరాలకు
అమరత్వం అబ్బినట్టూ..
మొండివైన బండరాళ్లు
యుగయుగాల ఒత్తిళ్ళను
తట్టుకుంటూ..
తటస్థంగా నిలబడి చరిత్రకు
పునాదులుగా నిలుస్తాయి..
వాటిపై రాసే రాతలన్నీ
శిలాక్షరాలుగా, శాసనాలు
వర్ధిల్లుస్తూ,పూర్వవైభవాలను
పునరావృతం చేస్తూ,
సజీవ శిల్పాలుగా దీటుగా నిలబడి
జాతి సంస్కృతి సంప్రదాయాలను
ముందు తరాలకు అందిస్తూ
నాగరికతకు మచ్చు తునకలుగా
నిలుస్తాయి..!!
ఎన్ని దండయాత్రలు జరిగినా
తునాతునకలై విరిగిపడినా
గతచరిత్రకు ప్రమాణ పత్రాలై
తమ పాత్రను..ప్రామాణికంగా
పోషిస్తాయి..
అలనాటి రాచరికపు రాజసాన్ని
కళ్ళముందుంచి..
జాతి వారసత్వ నిధులుగా నిలుస్తాయి..!!

**-సావిత్రి రంజోల్కర్,**
నవీముంబై

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com